Follow: @ANNTELUGU
05-02-2025
ANN తెలుగు
మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 65 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



# త్వరలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తాం

- పదేళ్లలో అవినీతి రహిత పాలన అందించాం
- 25 కోట్ల మందిని పేదరికం నుండి బయటపడేశాం: లోక్ సభలో ప్రధాని మోదీ
- ఇప్పుడు ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామానికి రూపాయి అందుతోంది
- ప్రజల సొమ్ము ప్రజల చేతికే" అనేది మా నినాదం

03

టాప్ న్యూస్

## నా ఇంట్లోకి రేవంత్ ఫొటో రాలే



- వైఎస్సార్ .. కేసీఆర్ ఫొటోలు ఉన్నాయి
- అవసరమైతే జైలుకుపోతా.. నో కాంప్రమైజ్
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు

02

## ఈ అసెంబ్లీ సమావేశాలు ఎంతో స్పెషల్



- ఇవి సామాజిక న్యాయ అసెంబ్లీ సమావేశాలు
- బీసీ జనాభాపై బీజేపీ, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి


03

## ఫ్యాన్స్ సిద్ధం కండమ్మా..!



- జూనియర్ ఎన్టీఆర్ త్వరలో భేటీ
- అందరినీ కలుస్తానని ప్రకటన

03



## సచివాలయాన్ని పేల్చేస్తా

- 3 రోజులుగా బెదిరింపు కాల్స్
- లంగర్‌హౌజ్‌కు చెందిన సయ్యద్ మీర్ మహ్మద్ అలీని నిందితుడిగా గుర్తించిన పోలీసులు

03



## భాగ్యనగరానికి బుల్లెట్ రైలు..

- హైదరాబాద్-ముంబై మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్
- దీనిని బెంగళూరు, చెన్నై వరకు విస్తరించే యోచన
- దేశంలోని ప్రధాన నగరాలను బులెట్ రైలుతో అనుసంధానించే భారీ ప్రాజెక్ట్‌లో కీలక ముందడుగు
- హైదరాబాద్ నుంచి ముంబై, బెంగళూరు, చెన్నైకి ఇక రెండుమూడు గంటల్లోనే..

02




## మందుబాబులకు లిక్కర్ సేల్ ఆఫర్

- లక్కీ డ్రాలో థాయ్ లాండ్ ట్రిప్
- కాకినాడలో ఓ వైన్ షాప్ యజమాని బిజినెస్ థీమ్

02



కులగణనపై అసెంబ్లీలో తీర్మానం.. ఎస్సీ వర్గకరణపై ప్రభుత్వం నివేదిక ఇవ్వడంపై సీఎం రేవంత్ రెడ్డికి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపిన టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు మరియు ఎమ్మెల్యేలు

# చరిత్ర సృష్టించాం

## దేశంలో తొలిసారి కులగణన చేశాం

ఈ సర్వేతో ప్రధాని మోదీపై ఒత్తిడి పెరిగింది

దేశమంతా కులగణన చేయాలన్న డిమాండ్ వస్తోంది.. బాధ్యతగా సర్వే చేశాం

రాజకీయ లబ్ధి కోసమే సర్వేపై కేసీఆర్ కుటుంబం విమర్శలు

ఎస్సీవర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయమే శిరోధార్యం

రాష్ట్రంలో 56% మంది బీసీలు, 17 శాతం మంది ఎస్సీలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** దేశ చరిత్రలో మొదటిసారి కులగణన చేసి తాము చరిత్ర సృష్టించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ గా పలు అంశాలపై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సమగ్ర సర్వేను నిర్వహించారని, ఆ వివరాలను మాజీ సీఎం కేసీఆర్ చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు సంబంధించిన నివేదికలు కూడా ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతతో పనిచేసి సర్వేను విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. కేసీఆర్ కుటుంబం ఏ పని చేసినా చిత్తశుద్ధి లేకుండానే ముందుకు సాగిందని, రాజకీయ లబ్ధి కోసమే కేసీఆర్ కుటుంబం సర్వేపై కూడా విమర్శలు చేస్తున్నారన్నారు. తమ కులగణన సర్వే ద్వారా 56% మంది బీసీలు, 17 శాతం మంది ఎస్సీలు రాష్ట్రంలో ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. వర్గీకరణ జరగాలని ఎప్పటి నుండో మాదిగ, మాలలు పోరాటం చేస్తున్నారని సీఎం అన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో సుప్రీంకోర్టు తీర్పు, కమిషన్ నివేదిక, సబ్ కమిటీ నివేదిక సూచన

మిగతా 2లో

భూముల వివరాలు అడిగితే..

## కేసీఆర్, కేటీఆర్‌కు భయమెందుకు?

అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫైర్

- 50 రోజుల సర్వేలో బీఆర్ఎస్ ముఖ్యనేతలే వివరాలు ఇవ్వలే
- బలహీనవర్గాలకు హక్కులు ఇవ్వడం మోదీకి ఇష్టం లేదు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం సీట్లు ఇస్తాం
- అన్ని పార్టీలు బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వాలి
- అసెంబ్లీలో కులగణన నివేదిక ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి

03

# మూడు గ్రూపులుగా ఎస్సీల విభజన

"నేను 20 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా. నా రాజకీయ జీవితంలో ఆత్మ సంతృప్తిని కలిగించిన రోజు ఇది. ఇలాంటి అవకాశం నాకు రావడం సంతోషం. చరిత్రపుటల్లో ఇది శాశ్వతంగా నిలిచిపోతుంది. వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఉపకులాల వర్గీకరణ అమలుకు చర్యలు చేపట్టింది. అతి తక్కువ సమయంలో సంక్లిష్టమైన సమస్యకు పరిష్కారం చూపేందుకు కృషి చేసిన అందరికీ అభినందనలు. - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



- గ్రూప్-2లోని 18 ఉప కులాలకు 9 శాతం రిజర్వేషన్లు
- గ్రూప్-3లోని 26 ఉప కులాలకు 5 శాతం రిజర్వేషన్
- ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం
- అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన
- ఇలాంటి అవకాశం నాకు రావడం సంతోషం
- నా రాజకీయ జీవితంలో ఆత్మ సంతృప్తిని కలిగించిన రోజు
- గాంధీభవన్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సంబురాలు

02

## స్పీకర్ కార్యాలయం నుండి నోటీసులు

- ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసిన అసెంబ్లీ కార్యదర్శి
- బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది
- నోటీసులు అందాయన్న ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, తెల్లం వెంకట్రావు



**హైదరాబాద్, మహా:** ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బిగ్ షాక్ తగిలింది. బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ కార్యాలయం నుండి నోటీసులు జారీచేశారు.

మిగతా 2లో



## ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తున్నాం : కేటీఆర్

**బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లు పెడతారని ఆశించాం**

**మహా:** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని కేటీఆర్ గుర్తు చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా రేవంత్ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ చేసిన సిఫారసులను సభలో ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణపై కేటీఆర్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో 2001 నుంచి స్పష్టంగా ఉన్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.

మిగతా 2లో

## ఢిల్లీ ఓటరు తీర్పు నేడే

- అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధం
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 1.56 కోట్ల మంది

02




## మల్లన్న నన్ను తిట్టొచ్చు కులాన్ని తిట్టడం సరికాదు

- కులాలను తిట్టడం వల్ల మనస్పర్థలు వస్తాయి
- చిట్ చాట్‌లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి



వివరాలు 2లో


## కవిత కటీఫ్

సొంత అజెండా..

- బీసీల కోసం రాజీలేని పోరు
- బీసీల తరుపున బీఆర్ఎస్ కంటే ముందే ఉద్యమం షురూ చేసిన కవిత
- కవిత అంటే భయపడుతున్న కీలక నేత
- అవమానాలపై కవిత మద్దతుదారుల ఆగ్రహం



03







# రేవంతుడా నీకే సాధ్యం.. చరిత్రలో ఒకే ఒక్కడు

- అభినందనల్లో ముంచెత్తిన ఎమ్మెల్యేలు, నేతలు
- ఎస్సీ వర్గీకరణకు ఆమోదంపై హర్షా తిరేకాలు
- దేశానికే మార్గం చూపిన నవనాయకుడు

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అభినందనల జల్లు కురుస్తోంది. సాహసాలు మీకు మాత్రమే సాధ్యమని మరోసారి రుజువుచేశారంటూ సీఎం రేవంత్ పై ఎస్సీ ఎమ్మెల్యేలు, నేతలు సత్కరించడంతో పాటు ఆనందంతో గెంతులేశారు. తమ జాతి మూడుదశాబ్దాల పోరాటం నెరవేర్చిన ఒకేఒక్కడుగా చరిత్రలో రేవంత్ నిలిచిపోయారని నేతలు ప్రశంసించారు. సుప్రీంకోర్టు ఆమోదించినా ముఖ్యమంత్రి రేవంత్ అత్యంత పకడ్బందీగా దీనిని కొలిక్కి తెస్తారని ఊహించని నేతలు సీఎం చాణక్యానికి, శ్రమకు సలాం కొడుతున్నారు. వావ్.. గ్రేట్ అంటూ అభినందిస్తున్నారు. ఒకేరోజు కులగణన ద్వారా బిసి జనాభాను దేశం ముందు ఉంచడం, ఎస్సీ వర్గీకరణను సింపుల్ గా కొలిక్కితెచ్చి మూడువర్గాలుగా నివేదికను ఆమోదించడంతో రేవంత్ రియల్లీ గ్రేట్ .. దేశానికే మార్గం చూపిన నవ నాయకుడు అంటూ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. పిసిసి చీఫ్, మంత్రులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలంతా ఆయనను ప్రశంసిస్తున్నారు. వర్గీకరణతో అత్యంత వెనుకడ్డవారికి మేలు జరుగుతుందని, పోరాటాలను ఒడ్డుకు చేర్చిన ఘనత, త్యాగాలకు ఫలితమిచ్చిన ప్రభుత్వంగా రేవంత్ సర్కార్ చరిత్రలో నిలిచిపోతుందని ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన వారికి నివాళులు అర్పిస్తున్నా. త్వరలోనే వర్గీకరణను చట్టం రూపంలో తీసుకువచ్చి శాశ్వత పరిష్కారాన్ని చూపుతామని సీఎం రేవంత్ రెడ్డి తనను కలిసిన నేతలకు హామీనిచ్చారు.

# చరిత్ర సృష్టించాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం తాము ముందుకెళ్తామని సీఎం సూచనప్రాయంగా తెలిపారు.

### ఏ సర్వే జరిగినా ఇదే ప్రామాణికం

భవిష్యత్తులో ఏ సర్వే జరిగినా తాము నిర్వహించిన కులగణన సర్వేను ప్రామాణికంగా తీసుకోవాలని, దేశ చరిత్రలో మొదటిసారి కులగణన పూర్తి చేసి చరిత్ర సృష్టించామని రేవంత్ రెడ్డి అన్నారు. తెలిపారు. ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఉన్న కేసీఆర్ అసెంబ్లీకి రావాలి.. తాము ఇక్కడ రాజకీయాల కోసం ఏది చేయడం లేదని కేవలం రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగుతున్నామన్నారు. 88 జనరల్ సీట్లలో బీసీలకు తాము 30 సీట్లు కేటాయించామని, 33 శాతం వారికే కేటాయించామన్నారు. ఈరోజు దేశ చరిత్రలో నిలిచిపోతుందని, తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సర్వేతో .. ప్రధాని నరేంద్ర మోడీపై ఒత్తిడి పెరిగిందన్నారు. అన్ని రాష్ట్రాలలో కులగణన చేయాలనే డిమాండ్ రానుందని, భవిష్యత్తులో తాము ప్రవేశపెట్టే డాక్యుమెంట్ రిఫరెన్స్ తీసుకోవాలన్నారు. 2011 జనాభా లెక్కల తర్వాత మళ్లీ తమ ప్రభుత్వమే కులగణన సర్వే చేసిందన్నారు. 2014 లెక్కలు ఎక్కడ ఉన్నాయో చేసిన వాళ్ళే చెప్పాలని అసెంబ్లీకి రానివారు అసెంబ్లీ సమయం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

### కేటీఆర్ సూసైడ్ చేసుకుంటారేమో

కొందరు ఉపఎన్నికల గురించి మాట్లాడుతున్నారని, సిరిసిల్లలో ఉప ఎన్నికలు వచ్చే అవకాశాల కోసం కేటీఆర్ సూసైడ్ చేసుకుంటారేమోనని సీఎం సంచలన వ్యాఖ్యలు చేశారు.

# మూడు గ్రూపులుగా ఎస్సీల విభజన

**హైదరాబాద్, మహా:** ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. అన్నీ రాష్ట్రాల కంటే ముందే వర్గీకరణను తామే అమలు చేస్తామని మరోసారి సీఎం ప్రకటించారు. వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశామని, ఆ కమిషన్ తాజాగా రిపోర్టు ఇచ్చిందని ఆయన చెప్పారు. ఆ కమిషన్ కూడా ఎస్సీ వర్గీకరణ చేయాలనే సిఫార్సు చేసినట్లు అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు తాము కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణలో ఎస్సీల్లో మొత్తం 59 ఉప కులాలను ఏకసభ్య కమిషన్ గుర్తించిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వారిని మూడు గ్రూపులుగా వర్గీకరించాలని కమిషన్ సిఫార్సు చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎస్సీలను గ్రూప్ 1, 2, 3గా వర్గీకరించాలని కమిషన్ సూచించిందని, మొత్తం 15 శాతం రిజర్వేషన్లను 3 గ్రూపులకు పంచుతూ సిఫార్సు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రూప్1లో 15 ఉప కులాలకు ఒక శాతం రిజర్వేషన్ ఇవ్వాలని చెప్పినట్లు సీఎం పేర్కొన్నారు. ఆ 15 ఉపకులాల జనాభా 3.288 శాతంగా ఉందని ఆయన వెల్లడించారు. గ్రూప్2లోని 18 ఉప కులాలకు 9 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కమిషన్ చెప్పిందని, ఆ 18 ఉప కులాల జనాభా 62.748గా ఉందని సీఎం తెలిపారు. గ్రూప్3లోని 26 ఉప కులాలకు 5 శాతం రిజర్వేషన్‌ను ఏకసభ్య కమిషన్ సిఫార్సు చేసినట్లు సీఎం చెప్పారు. ఈ 26 ఎస్సీ ఉప కులాల జనాభా 33.963 శాతంగా ఉందని పేర్కొన్నారు.



### మూడు దశాబ్దాల పోరాటం సాకారం

మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ పోరాటం జరుగుతోంది. ఈరోజు ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం నాకు ఎంతో సంతృప్తినిస్తోంది. ఎంతోమంది ముఖ్యమంత్రులకు రాని అవకాశం నాకు వచ్చింది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు వర్గీకరణకు శాశ్వత పరిష్కారం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నేను 20 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా. నా రాజకీయ జీవితంలో ఆత్మ సంతృప్తిని కలిగించిన రోజు ఇది. ఇలాంటి అవకాశం నాకు రావడం సంతోషం. చరిత్రపుటల్లో ఇది శాశ్వతంగా నిలిచిపోతుంది. వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అమలుకు చర్యలు చేపట్టింది. అతి తక్కువ సమయంలో సంక్లిష్టమైన సమస్యకు పరిష్కారం చూపేందుకు కృషి చేసిన అందరికీ అభినందనలు. ఆనాడు ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు అడ్జర్న్ మోషన్ అందిస్తే నన్ను సభ నుంచి బయటకు పంపించారు. కానీ ఈనాడు సభా నాయకుడిగా వర్గీకరణ అమలుకు సభలో నిర్ణయం తీసుకుంటున్నా. ఇది బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం వల్లే సాధ్యమైంది. రంగుల గోడలు.. అద్దాల మేడలు కాదు.. చివరి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించాలన్న అంబేద్కర్ ఆశయానికి అనుగుణంగా మా ప్రభుత్వం పనిచేస్తోంది. ఇందుకు సభ్యులందరితోపాటు ప్రతి ఒక్కరూ సహకారం ఉండాలని కోరుతున్నానని" చెప్పారు.

### గాంధీభవన్‌లో వర్గీకరణ సంబరాలు

గాంధీభవన్ తో రాష్ట్రవ్యాప్తంగా బిసి కులగణన, ఎస్సీవర్గీకరణ నివేదికలకు ఆమోదంపై సంబురాలు జరిగాయి. ఎస్సీ వర్గీకరణ ప్రకటించడంతో సంబరాలు మిన్నంటాయి. గాంధీభవన్ లో ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు బిసి, ఎస్సీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సామాజిక, ఆర్థిక సర్వేను ప్రకటించడం, ఎస్సీవర్గీకరణ కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు. పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, కేకేశవరావు తదితరులు సీఎంను అభినందించారు.

# ఢిల్లీ ఓటరు తీర్పు నేడే

**మహా, న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 1.56కోట్ల మంది ఓటర్లు రేపు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. బుధవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఫిబ్రవరి 8న పోలైన ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ ఫిబ్రవరి 10 తో ముగియనుంది. ఢిల్లీలోని 70 నియోజకవర్గాల్లో 58 జనరల్ సీట్లు కాగా.. మరో 12 ఎస్సీ రిజర్వ్ సీట్లు. మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లలో 83.49 లక్షల మంది పురుష ఓటర్లు కాగా.. 71.74 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వారిలో 20 నుంచి 29 ఏళ్ల వయస్సు గల యువ ఓటర్ల సంఖ్య 25.89 లక్షలుగా ఉంది. 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల తొలిసారి ఓటేసే వారి సంఖ్య 2.08 లక్షలు. ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక అవసరాలు ఉన్న వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ప్రకటించారు. పీడబ్ల్యూడీ వర్గం నుంచి 79,430 మంది ఓటర్లు ఉన్నారు. ఇక 100 సంవత్సరాలు దాటిన ఓటర్ల సంఖ్య 830 గా ఉంది. 85 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్లు 1.09 లక్షల మంది ఉన్నారు. ఢిల్లీలో ట్రాన్స్ జెండర్ ఓటర్ల సంఖ్య 1,261 గా ఉంది.

# మందుబాబులకు లిక్కర్ సేల్ ఆఫర్

**మహా :** ఇదేందయ్యా ఇది.. నేనెప్పుడూ చూడలే అనే డైలాగ్ తెలుగు రాష్ట్రాల్లో బాగా ఫేమస్. ఇప్పుడు చెప్పబోయే మందు కబురు వింటే.. మందు బాబులు అంతా కూడా యునానిమస్ గా ఇదే మాట చెప్పడం గ్యారంటీ. వ్యాపారాన్ని పెంచుకోవడం కోసం ఒక్కొక్కరు ఒక్కో విధానాన్ని ఫాలో అవుతూ ఉంటారు. అది ఏ సెక్టార్ అయినా కానీ వారి వారి స్టైల్లో ప్రజలని ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. బంపర్ ఆఫర్లు, డిస్కౌంట్లు ప్రకటిస్తుంటాయి. ఆ పండగ ఈ పండుగ అనే తేడా లేకుండా ఫెస్టివల్ సేల్ అని.. సమ్మర్ సేల్, వింటర్ సేల్, అంటూ డిస్కౌంట్లు ఇచ్చేస్తుంటారు. ఇక అప్పుడప్పుడూ లక్కీ డ్రాలు కూడా నిర్వహించడం షరా మామూలే. కానీ ఫర్ ది ఫస్ట్ టైమ్.. ఓ మద్యం దుకాణం యజమాని ఇచ్చిన ఓ బంపరాఫర్ మందుబాబులనే కాదు సామాన్యులను సైతం షాక్ కి గురి చేస్తోంది.

కాకినాడ లోని వినాయక వైన్స్ యజమాని కస్టమర్లకు కళ్లు చెదిరిపోయే ఆఫర్ ఇచ్చారు. టికెట్ టు థాయిలాండ్ అంటూ ఆఫర్ ప్రకటించాడు. తన మద్యం దుకాణంలో అన్ని లిక్కర్ బ్రాండ్లు దొరుకుతాయని షాపులో మందు కొన్నవారికి టోకెన్లు ఇస్తామని ప్రకటించాడు. ఓ మంచి రోజు చూసి ఆ టోకెన్లను లాటరీ తీస్తామని, అందులో గెలిచిన వారికి ఉచితంగా




థాయిలాండ్ వెళ్లే అవకాశం ఇస్తామని అఫిషియల్ అనౌన్స్ మెంట్ ఇచ్చేశాడు. ఈ మేరకు తన షాపు ముందు బోర్డులు కూడా ఏర్పాటు చేయించాడు. ఆ బోర్డుల్లో మందు తాగండి.. థాయిలాండ్ వెళ్లండి అంటూ క్యాప్షన్ కూడా రాసుకొచ్చాడు. అంతే కాకుండా ఈ లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి కారు, బైక్, మొబైల్ ఫోన్ వంటి బహుమతులు కూడా ఇవ్వనున్నట్టు ప్రకటించాడు. ఈ మొత్తం గిఫ్ట్ ల విలువ కూడా దాదాపు రూ. 1.5 లక్షల విలువ ఉంటుందని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ బంపర్ ఆఫర్ విషయం సోషల్ మీడియాలో సైతం పోస్ట్ చేయడంతో వైరల్ గా మారింది. ఈ ఆఫర్ చూసి మందుబాబులు అంతా వర్త్.. వర్త్ అంటూ షాప్ ముందు క్యూ కడుతున్నారు. మరి లక్కీ డ్రాలో గెలిచి ఉచితంగా థాయిలాండ్ వెళ్లే లక్కీ ఛాన్స్ ఎవరికి వస్తుందో చూడాలి.

# భాగ్యనగరానికి బుల్లెట్ రైలు

హైదరాబాద్‌ముంబై మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్.. దీనిని బెంగళూరు, చెన్నై వరకు విస్తరించే యోచన

దేశంలోని ప్రధాన నగరాలను బులెట్ రైలుతో అనుసంధానించే భారీ ప్రాజెక్ట్‌లో కీలక ముందడుగు

హైదరాబాద్ నుంచి ముంబై, బెంగళూరు, చెన్నైకి ఇక రెండుమూడు గంటల్లోనే

**మహా:** హైదరాబాద్ వాసులు బుల్లెట్ రైలు ఎక్కే రోజులు ఎంతో దూరంలో లేవు. దేశంలోని ప్రధాన నగరాలను బుల్లెట్ రైలుతో అనుసంధానించే భారీ ప్రాజెక్టులో మరో కీలక అడుగు పడింది. హైదరాబాద్‌ముంబై మధ్య 709 కిలోమీటర్ల మేర హైస్పీడ్ కారిడార్ నిర్మించాలని రైల్వే నిర్ణయించింది. ఈ కారిడార్‌ను బెంగళూరు వరకు విస్తరించాలని భావిస్తోంది. దీంతోపాటు మైసూరుచెన్నై మధ్య నిర్మించ తలపెట్టిన హైస్పీడ్ రైలు కారిడార్‌ను కూడా హైదరాబాద్ వరకు విస్తరించాలని యోచిస్తోంది. అదే జరిగితే హైదరాబాద్ నుంచి ముంబై, చెన్నై, బెంగళూరుకు మధ్య ప్రయాణ దూరం గంటల్లోకి తగ్గిపోతుంది. ప్రస్తుతం ముంబైఅహ్మదాబాద్ మధ్య జపాన్ సంస్థ సాంకేతికత, ఆర్థిక సాయంతో హైస్పీడ్ కారిడార్ నిర్మిస్తున్నారు. ఈ మార్గంలో జపాన్ తయారీ బుల్లెట్ రైలు నడవనుంది. ఆ తర్వాతి దశలో మరిన్ని హైస్పీడ్ కారిడార్లు నిర్మించనున్నారు. వాటిలో పైన పేర్కొన్న హైదరాబాద్‌ముంబై, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై మార్గాలు కూడా ఉన్నాయి. వీటిలో హైదరాబాద్‌చెన్నై, హైదరాబాద్‌బెంగళూరు కారిడార్లను ఎలివేటెడ్, భూగర్భ మార్గాల్లో నిర్మిస్తారు. హైదరాబాద్‌బెంగళూరు మధ్య దూరం 618 కిలోమీటర్లు.



సాధారణ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లలో హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లేందుకు 11 గంటలు, వందేభారత్‌లో ఎనిమిదిన్నర గంటల సమయం పడుతోంది. అదే బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే కేవలం 2 గంటల్లోనే బెంగళూరు చేరుకునే వెసులుబాటు లభిస్తుంది. అలాగే, హైదరాబాద్‌చెన్నై మధ్య దూరం 757 కిలోమీటర్లు కాగా, సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అయితే 15 గంటల సమయం పడుతుంది. బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే ఈ సమయం రెండున్నర గంటలకు తగ్గిపోతుంది. అయితే, ఈ ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు 10 నుంచి 13 సంవత్సరాలు పడుతుందని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు.

# మల్లన్న నన్ను తిట్టొచ్చు కులాన్ని తిట్టడం సరికాదు

- కులాలను తిట్టం వల్ల మనస్పర్థలు వస్తాయి
- చిట్ చాట్ లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి

**మహా:** రాజకీయాలలో గెలుపు ఓటములు సహజమని, గెలిచినా, ఓడినా ప్రజలే నిర్ణేతలన్న విషయాన్ని మరువద్దని మంత్రి కోమటిరెడ్డి వెంకటచ్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చిట్ చాట్ గా మాట్లాడిన మంత్రి ఎమ్మెల్సీ తీన్మార్ వ్యాఖ్యలపై స్పందించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశాడు. ఆయన బీ ఫాం పార్టీ నాకే ఇచ్చింది, నేనే బీ ఫాంను మల్లన్నకు ఇచ్చా, ఆ తర్వాత భారీ ర్యాలీగా కూడా నిర్వహించామన్నారు, అలాంటి నేను, అదీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మల్లన్నను ఓడించేందుకు ప్రయత్నించానని ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. మంత్రిగా నా బాధ్యత పార్టీ నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించడం, ఓడించేందుకు ప్రయత్నించానని ఇప్పుడు మాట్లాడటం దారుణమన్నారు. మినిస్టర్ గా ఉండి ఎమ్మెల్సీ ఓడిపోవాలని ఎవరైనా కోరుకుంటారా అని అన్నారు. మల్లన్న విమర్శలను అయన విజ్ఞతికే వదిలేస్తున్నానని పేర్కొన్నారు. మల్లన్న కాంగ్రెస్ బీ ఫాం మీద గెలిచి నాపై లేని పోనీ ఆరోపణలు చేస్తున్నారన్నారు. మల్లన్న నన్ను తిడితే స్వాగతిస్తా, కానీ ఒక కులాన్ని తిట్టడం సరైంది కాదన్నారు. బీసీ మీటింగ్ పెట్టి ఇతర కులాల ను తిట్టడం వల్ల ప్రజల మధ్య మనస్పర్థలు వస్తాయన్నారు. బీసీల కోసం కాంగ్రెస్ గొప్ప నిర్ణయం తీసుకుందన్నారు. అందుకే శాసనసభలో చర్చ కూడా పెట్టామన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నాకే కాదు భట్టి, ఉత్తమ్ కు దగ్గర, అనిరుద్ రెడ్డి ఏ భూమి గురించి అడగలేదన్నారు. ఎమ్మెల్యేల మీటింగ్, రహస్య భేటీ అన్న దాంట్లో వాస్తవం ఎంతుందో తెలియదన్నారు. సీఎం ఎవరినీ గరవించడం లేదు, అపాయింట్ మెంట్ దొరకడం లేదనడంలో నిజం లేదన్నారు. ఉప్పల్ ఫ్లైఓవర్ పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. కొన్నాళ్ళ క్రితం వరకు భూసేకరణ తదితర ఇబ్బందుల వల్ల కొంత జాప్యం జరిగిన విషయం వాస్తవమని తెలిపారు. కొద్ది రోజుల్లో ఎస్ఎల్ బీసీ టన్నెల్ పనులు మొదలవుతాయని, ఈ ఏడాది చివరికల్లా పనులు కొలిక్కి తెస్తామని చెప్పారు.

### వారి ఆస్తులు రాయాలంటే బుక్ లెట్ కావాలి

బీఆర్ఎస్ నేతలపై మంత్రి విరుచుకుపడ్డారు. కేసీఆర్ ,కేటీఆర్, హరీష్ రావుల ఆస్తులు రాయాలంటే ఒక బుక్ లెట్ కావాలన్నారు. అందుకే సర్వేలో కవిత మినహా కేసీఆర్ ఫ్యామిలీ పాల్గొనలేదన్నారు. కులగణనపై అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని, కేంద్రం ఓకే అంటే సరే లేదంటే మా పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తామని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణ విషయం లో ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఈనెలలోనే మరో రోజు సభ పెడుతామన్నారు.

# నా ఇంట్లోకి రేవంత్ రెడ్డి ఫొటో రాలే

**వైఎస్సార్ కేసీఆర్ ఫొటోలు ఉన్నాయి.. అవసరమైతే జైలుకుపోతా.. నో కాంప్రమైజ్**

**ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మహా:** "నేను పోలీసులతో, హైడ్రా విషయంలో కాంప్రమైజ్ అయ్యే ప్రసక్తే లేదు. మా ఏరియాకు వస్తే ఊరుకునేది లేదని రంగనాథ్‌కు చెప్పిన. పేదల ఇండ్లను కూలుస్తాం అంటే ఊరుకోను. అవసరమైతే జైలుకు పోతా కానీ కాంప్రమైజ్ కాను. నా ఇంట్లో వైఎస్, కేసీఆర్ ఫోటోలు ఉన్నాయి. రేవంత్ రెడ్డి ఫోటో ఇంకా రాలేదు" అంటూ దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ లాబీల్లో మీడియాతో మాట్లాడిన ఆయన మరోసారి హాట్ కామెంట్స్ చేయడంపై కాంగ్రెస్ వర్గాలు భగ్గుమంటున్నాయి. అధికార పార్టీలో ఉండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దానం వ్యవహరిస్తున్న తీరుపై పార్టీ నేతలు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చింతల్ బస్తీ కూల్చివేతలకు సంబంధించి దానం వ్యవహారతీరును పరిశీలిస్తామని టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ తెలిపారు. తాజాగా మరోసారి అధికారులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలతో పాటు రేవంత్ రెడ్డి ఫోటో విషయంలో ఆయన తీరుపై కాంగ్రెస్ పెద్దలు ఏవిధంగా స్పందిస్తారో చూడాలి.



# స్పీకర్ కార్యాలయం నుండి నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు దానం నాగేందర్, గాంధీ, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాసరెడ్డి, తెల్లం వెంకట్రావు, సంజయ్, కడియం, యాదయ్య, బండ్ల క్రిష్ణమోహన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి లకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీచేశారు. పార్టీ ఫిరాయింపుల పై లిఖిత పూర్వక సమాధానం చెప్పాలని నోటీస్ జారీచేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టు ను బిఆర్ఎస్ ఆశ్రయించిన నేపథ్యంలో సుప్రీం ఆదేశాలమేరకు ఈ నోటీసులు ఇచ్చారు.

### నోటీసులు అందాయి

తమకు స్పీకర్ కార్యాలయం నుండి నోటీసులు



అందాయని ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, డాక్టర్ సంజయ్ లు మీడియాకు తెలిపారు. న్యాయనిపుణులతో చర్చించి సమాధానం ఇస్తామన్నారు.

# ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తున్నాం : కేటీఆర్

**బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లు పెడతారని ఆశించాం**

(మొదటిపేజీ తరువాయి)



ప్రభుత్వం ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తే.. 42శాతం రిజర్వేషన్ల బిల్లు పెడుతున్నరేమో అనుకున్నామని.. చివరకు ఏదో సర్వే రిపోర్ట్‌ని పెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. అసెంబ్లీలో బీసీ కుల గణన నివేదికపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'ముఖ్యమంత్రి చారిత్రాత్మకమైన ప్రత్యేక శాసనసభ సమావేశాల్లో కామారెడ్డి డిక్లరేషన్ తరహాలో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి బిల్లు ప్రవేశపెడతారేమోనని.. ఆ బిల్లును శాసనసభలో ఆమోదింప చేసి.. చట్టబద్ధత కల్పిస్తారేమోనని రాష్ట్రవ్యాప్తంగా బలహీన వర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. కానీ, ముఖ్యమంత్రి లేచి నాలుగు పేర్లు చదువుతున్నారు. మీ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేదు. ఎందుకంటే రేవంత్‌రెడ్డి గారు మీరే చెప్పారు' అంటూ విమర్శించారు.

**బీసీలకు కాంగ్రెస్ పార్టీ మోసం- బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్**

వెనుకబడిన కులాల వారిని కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ ఆరోపించారు. బీసీ కులగణన సర్వేను బీఆర్ఎస్ తప్పు బడుతుందని చెప్పారు. మంగళవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మీడియాతో మాట్లాడారు.కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి తుంగలో తొక్కాడని ఆరోపించారు. బీసీలను రేవంత్ రెడ్డి మోసం చేశాడని , బీసీలను మోసం చేసినందుకు తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డిని తిరగనియ్యం అని స్పష్టం చేశారు.

# కవిత కటీఫ్

## సొంత అజెండా.. బీసీల కోసం రాజీలేని పోరు

**బీసీల తరుపున బిఆర్ఎస్ కంటే ముందే ఉద్యమం షురూ చేసిన కవిత**

**కవిత అంటే భయపడుతున్న కీలక నేత.. అవమానాలపై కవిత మద్దతుదారుల ఆగ్రహం**



**హైదరాబాద్, మహా:** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. బిసి రిజర్వేషన్లు, కులగణన విషయంలో ముందునుండీ అంశాన్ని ఎలుగెత్తి సభలు, సమావేశాలు నిర్వహించారు. పార్టీతో సంబంధం లేకుండా యునైటెడ్ పూలే ఫ్రంట్ పేరుతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేపట్టారు. గతేడాది జనవరి 3న సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగానే ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. అసెంబ్లీ స్పీకర్‌కు రాతపూర్వకంగా చేసిన ప్రతిపాదనలో కూడా పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో నెలకొల్పాలని కోరారు. కులగణన అంశం తెరపైకి రాకముందే బీసీ సంఘాలతో వరుస సమావేశాలను ఏర్పాటు చేసిన కవిత_ _ _స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్ ఇచ్చిన 42% హామీ అమలు కోసం పట్టుబట్టాలని వారికి దిశానిర్దేశం చేశారు. గత నెల 3న ఇందిరాపార్కులో భారీ సభను నిర్వహించి దాదాపు 80 బీసీ సంఘాల శ్రేణులను సమీకరించి తీర్మానాలను ఆమోదించేలా చొరవ తీసుకున్నారు. కవిత కార్యాచరణ బిఆర్ఎస్ లో హాట్ టాపిక్ గా మారగా, పార్టీ ఆదేశాలు లేకుండా ఇలాంటి కార్యక్రమాలు ఎందుకు నిర్వహిస్తున్నారంటూ కొందరు నేతలు ఆమెను అవమానించారు. అయినా పట్టుదలతో ముందుకు సాగారు. బీసీ ఇష్యూను ముందు చేపట్టిన కవిత తన రాజకీయ పరిణతిని, ముందు చూపును చాటుకున్నారు. అయితే కులగణనపై శాసనమండలిలో జరిగే చర్చలో కవితకు స్థానం కల్పించకుండా ముగ్గురు బీసీ నేతలను బిఆర్ఎస్ ఎంపిక చేసింది. మధుసూదనాచారి, ఎల్.రమణ, బండ ప్రకాశ్ ముదిరాజ్‌లను మాట్లాడాల్సిందిగా నాయకత్వం ఆదేశించింది. ఈ ముగ్గురి పేర్లనే చైర్మన్ ఆఫీసుకు పంపింది. చట్టసభల వెలుపల కవిత చేపట్టిన కార్యక్రమాలు హైలైట్ కావడంతో ఆమెకు మాట్లాడేందుకు చాన్స్ ఇవ్వకుండా ఓ నేత వ్యవహరించారన్న ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలోనే కవిత ప్రమేయం లేకుండానే బిసి కులగణనపై నిరసన వ్యక్తం చేస్తూ సభ నుండి వాకౌట్ చేయగా, కవిత మాత్రం సభలోనే ఉండి కులగణనకు సంబంధించి అభ్యంతరాలు, లోపాలను తనదైన శైలిలో చెప్పింది.

**కవిత అంటే భయపడుతున్నారా?**

కవిత అంటే బిఆర్ఎస్ లో ముఖ్యనేత భయపడుతున్నాడా? అభద్రతాభావంతో ఎవరైనా ఉన్నారా? అన్న చర్చ జరుగుతోంది. కవితది ముందునుండి మొండిగా పోరాటతత్వమే. నాడు తెలంగాణ జాగృతి పెట్టినా, ఇపుడు బిసి రిజర్వేషన్లపై కొట్లాడినా తన పోటీదారులకంటే ఆమె ఒకడుగు ముందే ఉంటారు. బీసీ రిజర్వేషన్ అంశంలో పార్టీ కంటే కవిత పైచేయి సాధించారనే చర్చ జరగడంతో నేతలు అప్రమత్తమయ్యారు. ముందుచూపు లేని కారణంగా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదాసీనంగా వ్యవహరించారన్న చర్చలు ఉండగా, కవిత దూకుడుకు అడుగడుగునా బ్రేకులు వేస్తున్నారని, సోషల్ మీడియాలో కవితపై సొంతపార్టీ నేతలు కొందరు కామెంట్లు పెడుతున్నారన్న ఆరోపణలున్నాయి. కవిత చేసిన త్యాగాలు, కవిత పడినన్ని కష్టాలు, చేసిన ఉద్యమాలు, కార్యాచరణ పార్టీలో ఇతర నేతలు చేయలేదన్న అభిప్రాయం పార్టీ నేతల్లో, యువతలో ఉంది. యూత్ లో, మహిళల్లో కవితకు మంచి ఫాలోయింగ్ ఉంది. తను మాటిస్తే కవిత ఎంతవరకైనా నిలబడతారన్న ప్రచారమూ ఉంది. పార్టీ కోసం బలయ్యారని, కవిత జైలుకు కూడా వెళ్ళారని.. త్యాగాలు కవిత చేస్తే అధికారం ఇతర నేతలు అనుభవిస్తున్నారంటూ ఆమె మద్దతుదారులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే కవిత మండలిలో స్వతంత్రంగా బిసి వాణి వినిపించడంతో పాటు తన పోరాటానికి ఎవరు అడ్డొచ్చినా డోంట్ కేర్ అంటోంది. ముందుముందు ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయో చూడాలి.

## కులగణన లెక్కలివే

(మహా ప్రత్యేకం)

సామాజిక ఆర్థిక రాజకీయ కుల గణన ప్రకారం:

బీసీ:
**1,64,09,179 (46.25%)**

బీసీ ముస్లింలు:
**35,76,588 (10.08%)**

మొత్తం బీసీలు:
**46.25%+10.08%= (56.34%)**

1 కోటి 99 లక్షల 85 వేల 767 వందలు

ఎస్సీలు:
**61,84,319 (17.43%)**

ఎస్టీలు :
**37,05,929 (10.45%)**

మొత్తం ముస్లింలు:
**44,57,012 (12.56%)**

బీసీ ముస్లింలు:
**35,76,588 (10.08%)**

ఓసి ముస్లింలు:
**8,80,424 (2.48%)**

ఇతర ఓసిలు:
**44,21,115 (13.31%)**

మొత్తం ఓసి జనాభా:
**53 లక్షల 01530**
**13.31%+ 2.48% = (15.79%)**

# ఐటీ విచారణకు హాజరైన దిల్ రాజు

**దాడుల సందర్భంగా సేకరించిన డాక్యుమెంట్లపై విచారించిన అధికారులు**

**అవసరమైతే మళ్ళీ పిలుస్తామన్న ఐటీ అధికారులు**



**మహా :** ప్రముఖ నిర్మాత, తెలంగాణ చలన చిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మన్ దిల్ రాజు ఆదాయపు పన్ను అధికారుల విచారణకు మంగళవారం హాజరయ్యారు. గత నెల తన నివాసంలో చోటు చేసుకున్న దాడులు, సోదాల నేపథ్యంలో విచారణకు రావాలంటూ ఐటీ అధికారులు నోటీసుల జారీ చేసిన నేపథ్యంలో విచారణకు హాజరయ్యారు. దిల్ రాజు నివాసాలు, కార్యాలయాలపై నాలుగు రోజుల పాటు ఐటీ దాడులు కొనసాగిన విషయం తెలిసిందే. ఆయన నిర్మించిన రెండు భారీ బడ్జెట్ సినిమాలు గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం మూడు రోజుల వ్యవధిలో విడుదల కావడం, అదే స్థాయిలో కలెక్షన్లను రాబట్టుకున్నాయంటూ ప్రకటనలు ఇవ్వడం ఈ దాడులకు కారణమయ్యాయి. ఈ దాడుల సమయంలో గుర్తించిన కొన్ని కీలక డాక్యుమెంట్లు, ఆర్థిక పరమైన లావాదేవీల గురించి ప్రశ్నించడానికి తాజాగా తమ కార్యాలయానికి పిలిపించుకున్నారు ఐటీ అధికారులు. దిల్ రాజు, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన స్థిర చరాస్తుల క్రయవిక్రయాలపై నిర్వహించిన పంచనామా గురించి అధికారులు ఆరా తీశారు. తనిఖీల సందర్భంగా సీజ్ చేసినట్లుగా చెబుతోన్న అకౌంట్ బుక్స్‌లో పొందుపరిచిన వివరాలపై ఈ విచారణ సందర్భంగా ఐటీ అధికారులు దిల్ రాజును ప్రశ్నించారు. ప్రత్యేకించి భారీ బడ్జెట్ సినిమాలకు ఎక్కడి నుంచైనా ఫైనాన్స్ తీసుకున్నారా?, ఆ ఫైనాన్షియర్లు ఎవరు? అనే విషయాల గురించి కూడా ఆరా తీసినట్లు సమాచారం. తన నివాసంపై జరిగిన ఐటీ దాడుల గురించి దిల్ రాజు ఇదివరకే వివరణ కూడా ఇచ్చారు. దాడుల సమయంలో ఇంట్లో 20 లక్షల రూపాయల లోపు మాత్రమే నగదు మొత్తం ఉందని, స్థిర చరాస్తులపై పంచనామా నిర్వహించారని వెల్లడించారు. దీనికి సంబంధించిన డాక్యుమెంట్లను తన చేతికి అందజేశారని అన్నారు. వాటిని ఈ విలేకరుల సమావేశంలో చూపించారు. ఈ అయిదు సంవత్సరాల కాలంలో తాము ఎలాంటి ఆస్తులను కొనుగోలు చేయలేదని వివరించారు. డాక్యుమెంట్ల పరిశీలన సందర్భంగా ఐటీ అధికారులు ఈ విషయాన్ని నిర్ధారించుకున్నారని దిల్ రాజు పేర్కొన్నారు. సంబంధిత శాఖ వద్దకు వెళ్లి తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారంటూ అప్పట్లో దిల్ రాజు చెప్పారు.

## ఈ అసెంబ్లీ సమావేశాలు ఎంతో స్పెషల్

- **ఇవి సామాజిక న్యాయ అసెంబ్లీ సమావేశాలు**
- **బీసీ జనాభాపై బీజేపీ, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం**
- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ కులగణన సర్వేలో బీసీ జనాభా తగ్గిందని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ మండిపడ్డారు. బీఆర్ఎస్ సర్వేలో ముస్లిం బీసీలను కలిపిన తర్వాత బీసీ జనాభా 51 శాతం వచ్చిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వ సర్వేలో బీసీ జనాభా 56 శాతంగా ఉందని మంత్రి వెల్లడించారు. బీఆర్ఎస్ చేసిన సర్వే కంటే తాము చేసిన సర్వేలో బీసీ జనాభా పెరిగిందని ఉత్తమ్ చెప్పుకొచ్చారు. గులాబీ పార్టీ సర్వేతో పోలిస్తే తమ కులగణనలో ఓసీల సంఖ్య తగ్గిందని తెలిపారు. ఓటర్ల సంఖ్యతో సర్వే సంఖ్యను పోల్చలేమని, ఓటర్ల లిస్టు ప్రకారం గ్రామాల్లో ఉన్నవారే హైదరాబాద్‌లోనూ ఉంటారని మంత్రి వెల్లడించారు. మంగళవారం జరిగింది సామాజిక న్యాయ అసెంబ్లీ సమావేశాలని ఉత్తమ్ అన్నారు.

# ఎమ్మెల్సీ మల్లన్నకు షోకాజ్ నోటీసులు?

**పరిశీలిస్తున్న టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ.. రేపో మాపో జారీ**



**మహా :** వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని టీ పీసీసీ క్రమశిక్షణా కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు మల్లన్న వ్యాఖ్యలు, వేర్వేరు సందర్భాలలో పార్టీకి ఇబ్బంది కలిగించే విధంగా మాటచ్లాడటం తదితర వాటన్నింటినీ క్రమశిక్షణా కమిటీ పరిశీలిస్తోంది. ఎమ్మెల్సీ మల్లన్న గత కొంత కాలంగా బీసీ నినాదాన్ని అందుకున్నారు. రాజ్యాధికారంలో బీసీలకు జరుగుతున్నఅన్యాయంపై పోరాడుతున్నారు. బీసీలకు మంత్రివర్గంలో ప్రాధాన్యం లేకపోవడం, మెజారిటీ మంత్రి పదవులు అగ్రవర్ణాలకే ఉన్నాయంటూ తప్పుపట్టారు. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేస్తానని అనేక సందర్భాలలో ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే వ్యాఖ్యలు చేసారు. మల్లన్న తీరుపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు పలువురు మంత్రులు, పార్టీ క్రమశిక్షణా కమిటీకి ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో మల్లన్న వ్యాఖ్యలను పరిశీలిస్తున్న కమిటీ నేడో, రేపో షోకాజ్ నోటీసు జారీ చేయాలని భావిస్తోంది. అయితే షోకాజ్ నోటీసులపై పార్టీ ముఖ్యులతో చర్చించిన అనంతరం స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. వరంగల్ లో జరిగిన బీసీ గర్జన సభలో మల్లన్న యొక సామాజిక వర్గాన్ని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికే కాంగ్రెస్ లోని పలువురు నేతలు తీవ్రంగా తప్పుపట్టారు. గతంలోనూ ఇల్లన్న బీసీలకు జరుగుతున్న అన్యాయంపై కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలను సీం రేవంత్ రెడ్డిని నిలదీస్తూ వ్యాఖ్యలు కూడా చేశారు.

**మల్లన్నపై డీజీపీకి ఫిర్యాదు చేసిన రెడ్డి సంఘం నేతలు..**

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై రెడ్డి సంఘాల నేతలు మండిపడుతున్నారు. తమ కులాన్ని దూషించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 2న వరంగల్ వేదికగా బీసీ సభను తీన్మార్ మల్లన్న నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన రెడ్డి కులంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారని, కుక్కలతో పోలుస్తూ దూషించారని ఆరోపణలు వస్తున్నాయి. మల్లన్న వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెడ్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెడ్డి కులాన్ని కించపరిచేలా దూషించారని, అతనిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పటికే ఉప్పల్ పోలీసులకు రెడ్డి మహిళా సంఘం నేతలు ఫిర్యాదు చేయగా మంగళవారం డీజీపీ జితేందర్ ను కలిసిన రెడ్డి సంఘం నేతలు మల్లన్నపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం దీనిపై వెంటనే స్పందించాలని కోరారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆ సంఘం నేతలు డిమాండ్ చేశారు. తెలంగాణ రెడ్డి కులానికి మల్లన్న క్షమాపణలు చెప్పాలని, చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని రెడ్డి సంఘాల నేతలు తీన్మార్ మల్లన్నపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## సప్త వాహనాలపై కోనేటిరాయుడు

- **తిరుమలలో వైభవంగా రథసప్తమి వేడుకలు**
- **అరసవల్లి సూర్యదేవాలయానికీ పోటెత్తిన భక్తులు**

**మహా, తిరుపతి:** తిరుమలలో రథసప్తమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రథసప్తమి సందర్భంగా మంగళవారం సప్త వాహనాలపై కోనేటిరాయుడు భక్తులకు దర్శనం ఇచ్చారు. వాహనసేవలను తిలకించేందుకు భారీగా భక్తులు తరలి రావడంతో తిరుమలలో రద్దీ నెలకొంది. భక్తులను దృష్టిలో పెట్టుకొని టీటీడీ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. గ్యాలరీలలో వేచి వుండే భక్తులు ఇబ్బందులు పడకుండా తిరు వీధుల్లోని గ్యాలరీల్లో జర్మన్ షెడ్లు ఏర్పాటు చేశారు. గ్యాలరీల్లో నిరంతరాయంగా భక్తులకు అన్నపానీయాల సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్యాలరీల్లోకి చేరుకోలేని భక్తులు.. వాహనసేవలను తిలకించేందుకు తిరుమాడ వీధులకు వెలుపల అధికారులు ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

**అరసవల్లిలోనూ..**

అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవాలయంలోనూ వేడుకలు వైభవంగా జరిగాయి. జనుగుతున్న వేడుకల్లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, జడ్పీ చైర్మన్ పిరియా విజయ, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, మామిడి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయ్ చంద్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఆదిత్యుడి నిజరూప దర్శనం కోసం సోమవారం రాత్రి నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది.

# త్వరలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తాం

## పదేళ్ళలో అవినీతి రహిత పాలన అందించాం

**25కోట్ల మందిని పేదరిరం నుండి బయటపడేశాం.. లోక్ సభలో ప్రధాని మోదీ**

**ఇప్పుడు ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామానికి రూపాయి అందుతోంది ప్రజల సొమ్ము ప్రజల చేతికే'' అనేది మా నినాదం**



**ఢిల్లీ, మహా:** త్వరలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని ప్రధాని తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా మోదీ ప్రసంగించారు. ''రాష్ట్రపతి ప్రసంగం మాలో ఆత్మవిశ్వాసం నింపింది. మరోసారి మా ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజలకు కృతజ్ఞతలు. వికసిత్ భారత్ సాధనే మా ప్రభుత్వ లక్ష్యం. మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తాం. గత ప్రభుత్వాలు గరీబీ హఠావో అని నినాదాలు మాత్రమే చేశాయి. కొందరు నేతలు బంగ్లాలు కట్టుకోవడంపై దృష్టిసారించారు. మేం మాత్రం ప్రతి ఇంటికీ నల్లా నీరు ఇవ్వడంపై దృష్టి పెట్టాం. దేశంలో పేదల కోసం 12 కోట్లకుపైగా మరుగుదొడ్లు కట్టించాం. కొందరు నేతలుwv పేదల గుడిసెల వద్ద వారితో ఫొటోలు దిగేందుకే ఉత్సాహం చూపిస్తారు. సభలో పేదల గురించి మాట్లాడితే.. ఫొటోలకు ఫోజులిచ్చిన నేతలు మొహం విసుగ్గా పెడతారు. ఢిల్లీ నుంచి రూపాయి పంపితే.. గ్రామాలకు 16పైసలే చేరుతోందని గతంలో ఓ ప్రధాని వాపోయారు. అప్పట్లో ఢిల్లీ నుంచి గల్లీ వరకూ ఒకే ప్రభుత్వం ఉన్నా అదే పరిస్థితి ఉండేది. కానీ, ఇప్పుడు ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామానికి రూపాయి అందుతోంది. నగదు బదిలీ ద్వారా నేరుగా ప్రజలకే ఇప్పుడు సొమ్ము అందుతోంది''

**ప్రజల సొమ్ము ప్రజల చేతికే**

''ప్రజల సొమ్ము ప్రజల చేతికే'' అనేది మా నినాదం. డిజిటల్ సాంకేతికత ద్వారా పారదర్శకత పెంచాం. పది కోట్ల నకిలీ ఖాతాలను గుర్తించి తొలగించాం. ఇథనాల్ బ్లెండింగ్ ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేశాం. గతంలో తరచూ రూ.లక్షల కోట్ల అవినీతిపై రోజూ వార్తలు వచ్చేవి. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలే లేవు. కొందరు శీష్ మహల్ నిర్మాణం కోసం అవినీతి చేస్తారు. మా హయాంలో మౌలిక వసతుల కల్పనపై భారీగా వెచ్చించాం. కేంద్రంలో పదేళ్లుగా అవినీతి లేకపోవడంతో జనం లాభపడ్డారు. ఆయుష్మాన్ భారత్, జన్ ఔషధి కేంద్రాల ఏర్పాటుతో రోగులకు ఎంతో మేలు జరిగింది'' ''మా హయాంలో ప్రతి రూపాయిని ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నాం. ప్రజల డబ్బును మేం అద్దాల మేడలు నిర్మించడానికి ఉపయోగించలేదు.. దేశాభివృద్ధికి వినియోగించాం. ప్రపంచ గేమింగ్ రాజధానిగా భారత్ తయారవుతోంది. మే అధికారంలోకి రాకముందు ఎల్ఈడీ బల్బు ధర రూ.400 ఉండేది. మా ప్రభుత్వం రాగానే ఎల్ఈడీ బల్బును రూ.40కే పంపిణీ చేశాం. దీని ద్వారా దేశ ప్రజలకు రూ.20వేల కోట్లు ఆదా అయింది. మా పాలన బాగుండటం వల్లే మళ్లీ గెలుస్తున్నాం. హరియాణాలో మూడోసారి అధికారంలోకి వచ్చాం. మహారాష్ట్రలోనూ తిరిగి అధికారంలోకి వచ్చాం''అని ప్రధాని వివరించారు.

## అధ్యక్షుడిగా బండిని కాంగ్రెస్ తీసేయలేదు

- **బండారు దత్తాత్రేయను భర్తరఫ్ చేసింది మేం కాదు..**
- **ఇప్పటికీ... ఎప్పటికీ మేం బీసీల పక్షమే**
- **బీజేపీ ఎంఎల్ఏ పాయల శంకర్‌కు మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ బిడ్డ బండి సంజయ్ ను తొలగించింది కాంగ్రెస్ పార్టీ కాదంటూ మంత్రి శ్రీధర్ బాబు ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రి వర్గం నుంచి బలహీన వర్గాలకు చెందిన బండారు దత్తాత్రేయ ను భర్తరఫ్ చేసింది కూడా మా పార్టీ కాదన్నారు.మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుల గణనపై బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ చేసిన నిరాధార ఆరోపణలపై ఆయన స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఒక్కసారి చరిత్ర తిరిగేయాలని, బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేసింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ మార్గ నిర్దేశనంలో ఆయన ఆలోచనలకు అనుగుణంగా బీసీలకు మేలు చేయాలనే సంకల్పంతోనే ఈ సర్వేను నిర్వహించామన్నారు. ఒక బీసీ బిడ్డగా ఇలాంటి మంచి కార్యక్రమాన్ని అభినందించాల్సింది పోయి ప్రభుత్వాన్ని విమర్శించడం సరి కాదన్నారు. మీ పార్టీ నాయకుల మాదిరిగా బీసీ బిడ్డలు ఉన్నత స్థానంలో ఉంటే ఓర్వలేని తత్వం మాది కాదన్నారు. ఒక బీసీ బిడ్డగా మీరు రాజకీయాల్లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి వాస్తవాలను తెలుసుకోవాలని హితవు పలికారు.

# అసెంబ్లీలో కులగణనపై చర్చ

**బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు.. బీజేపీ సభ్యుడి ప్రసంగానికి మంత్రుల కౌంటర్లు**

**అభ్యంతరం తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని**

**మహా :** కులగణన, ఎస్సీ వర్గీకరణపై చర్చించేందుకు మంగళవారం ప్రత్యేకంగా సమావేశమైన తెలంగాణ అసెంబ్లీలో ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. కులగణన సర్వేపై చర్చ సందర్భంగా బీజేపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. సర్వేలో బీసీల జనాభా తగ్గిందన్నారు. కులగణనలో పలు తప్పులు జరిగాయన్నారు. సమగ్రంగా సర్వే జరగలేదన్నారు. ప్రభుత్వం నిర్వహించిన సర్వేపై ప్రజల్లో ఎన్నో అనుమానాలున్నాయన్నారు. 2014 సమగ్ర కుటుంబ సర్వే లెక్కలతో పోల్చిచూస్తే ప్రస్తుత సర్వేలో బీసీ జనాభా తగ్గిందన్నారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ కులగణనపై అద్భుతంగా మాట్లాడారని, ఆయన వ్యాఖ్యలు విని ఎంతో సంతోషించానని పాయల్ శంకర్ తెలిపారు. బీసీల కోసం దేవుడు పంపిన దూత రేవంత్ రెడ్డి అని బీసీలంతా భావించారన్నారు. లోక్ సభలో రాహుల్ వ్యాఖ్యలకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు పొంతన లేదన్నారు. తన ఇంటికి సర్వేకు సంబంధించి రెండు స్టిక్కర్లు అంటించారని, సర్వేలో అనేక తప్పులు జరిగాయని, సమగ్రంగా జరగలేదని, పూర్తిస్థాయిలో ప్రజలు కులగణనలో పాల్గొనలేదని పాయల్ శంకర్ పేర్కొన్నారు. పాయల్ శంకర్ వ్యాఖ్యలపై మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు సీఎం రేవంత్ స్పందించారు. ప్రభుత్వం ఎంతో బాధ్యతాయుతంగా కులగణన నిర్వహించిందన్నారు. ప్రజల్లో అపోహలు సృష్టించేలా సభలో మాట్లాడవద్దన్నారు. ఈ లెక్కలకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహిస్తుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేష్లు కల్పించాలంటే చట్టసవరణ జరగాల్సి ఉంటుందని, కానీ సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 42 శాతం సీట్లు బీసీ అభ్యర్థులకు కేటాయిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. పాయల్ శంకర్ ప్రసంగానికి పదేపదే మంత్రులు అడ్డుతగులుతూ స్పందించడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభ్యంతరం తెలిపారు. సభలో బీసీల హక్కుల గురించి చర్చ జరుగుతున్నప్పుడు సభ్యులు చెప్పేది వినాలని, మంత్రులు చివరిలో స్పందించాలని, మధ్యమధ్యలో అడ్డుతగలడం సరికాదంటూ పాయల్ శంకర్‌కు మద్దతుగా మాట్లాడారు. ప్రతి సభ్యుడు చెప్పే విషయాన్ని, సూచనను ప్రభుత్వం వినాలన్నారు. పదేళ్లు బీఆర్ఎస్ పాలించినా, 55 ఏళ్లపాటు పాలించిన కాంగ్రెస్ ఇప్పటివరకు బీసీల కోసం ఏం చేసిందనేది ఆలోచించాలన్నారు. బీసీ కుల గణనపై సభలో చర్చ సందర్భంగా పాయల్ శంకర్‌కు తలసాని శ్రీనివాస్ యాదవ్ మద్దతుగా మాట్లాడటం ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ వెనుక బీఆర్ఎస్ ఉందన్న విషయం స్పష్టమవుతుందని, ప్రభుత్వంతో సంబంధం లేని నివేదికను సభలో చూపించి మాట్లాడటమంటే బీఆర్ఎస్ ఇచ్చిన నివేదికే అన్న విషయం స్పష్టమవుతుందన్నారు.



EDITORIAL సంపాదకీయం

# శాసనసభ్యులను సంతృప్తి పరచడం సాధ్యమా?

**"సార్ ! కారులో పెట్రోల్ కు కూడా డబ్బులు లేవు.పరిస్థితి కటకటగా ఉంది" అని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఒకరు నాతో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు."మా పార్టీ అధికారంలోకి వచ్చిందన్న సంతోషం లేకుండా పోయింది.పనులేవీ జరగడం లేదు. కార్యకర్తలకు,జనానికి ఎలా జవాబు చెప్పాలో తెలియడం లేదు" అన్నది మరో ఎమ్మెల్యే వ్యాఖ్య."ఎనకట్నే బాగుండే.జనం చేతుల్లో డబ్బులు బాగా కనిపించేవి"! ఇంకో ఎమ్మెల్యే మాట."గ్రామాల్లో పరిస్థితులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారుతున్నాయి.ఇంత త్వరగా ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని మేం ఊహించలేదు".కొందరు అధికారపార్టీ ఎమ్మెల్యేల నిట్టూర్పు.**





- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

ప్రజల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై వ్యతిరేకత ఎంత శాతం ఉందో ఎవరూ చెప్పలేకపోతున్నారు. అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ పార్టీ నాయకులకు క్షణమొక యుగం లాగా,అత్యంత భారంగా నడుస్తున్నందున రేవంత్ ప్రభుత్వంపై 'కృత్రిమ వ్యతిరేకత'ను సృష్టించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.ఈ 'ట్రాప్' లో అధికారపార్టీ ఎమ్మెల్యేలు చిక్కుకుంటున్నట్టు కొన్ని విశ్లేషణలున్నవి.ఏ పథకమూ అమలు కావడం లేదని ,రాష్ట్రంలో పరిస్థితి అత్యంత అధ్వాన్నంగా మారిందని బిఆర్ఎస్ చేస్తున్న ప్రచారం ఆకాశాన్నంటుతున్నది.

డబ్బు ఖర్చు చేయకుండా ఎమ్మెల్యే,ఎంపీ,ఎమ్మెల్సీ వంటి పదవులను సాధించడం అసాధ్యం.గడచిన మూడు దశాబ్దాలుగా ఎన్నికల్లో అభ్యర్థులు పెడుతున్న ఖర్చు ఎన్నో రెట్లు పెరిగింది.దీని తల్లి వేరు చంద్రబాబు నాయుడు,డాక్టరు వైఎస్ రాజశేఖరరెడ్డి అయితే ధనబలంతో ఏమైనా చేయగలమన్న కొత్త ఒరవడికి నాంది పలికిన నాయకుడు కేసీఆర్.ఉత్తరాది రాష్ట్రాలలో జరిగే ఎన్నికల్లో అభ్యర్థులు పెట్టే ఖర్చుతో పోల్చితే దక్షిణాది రాష్ట్రాలు,ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్,తెలంగాణలలో పెడుతున్న ఖర్చు ఊహకు అందని సంగతి.

ఎన్నికల్లో పెట్టిన ఖర్చును ఎలాగోలా రాబట్టుకోవాలన్న కాంక్ష ఎమ్మెల్యేలలో ఉండడం సహజం.రాజకీయం ,ఎన్నికలు,పార్టీలు,టికెట్లు, డబ్బు,వ్యాపారాలు,కాంట్రాక్టులు.... ఇదంతా ఒక గొలుసుకట్టు వ్యవహారం. దేనినీ విడదీయడానికి లేదు.డబ్బు ఖర్చు చేయకుండా ,ఓటర్లను కొనకుండా,ప్రలోభపెట్టకుండా గెలిచామని ఎవరైనా చెబితే అంతకన్నా బూటకం మరొకటి లేదు. కమ్యూనిస్టుపార్టీలు కూడా ఎంతో కొంత ఖర్చు పెట్టవలసిందే.

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలలో అసంతృప్తికి మూలం చేతిలో డబ్బు లేకపోవడమే.అక్రమమా ?సక్రమమా ?అనేది కాదు.డబ్బు సమకూర్చుకోవడం వాళ్లకు అవసరం.సంపద కూడబెట్టడం వారి ప్రాధాన్యం.పదేండ్ల కేసీఆర్ పాలన పీడ విరగడ అయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినందుకు ఆ ఎమ్మెల్యేల ముఖాల్లో సంతోషం లేకపోవడం వెనుక రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు కారణం.వచ్చిన అధికారాన్ని నిలుపుకునేందుకు,వచ్చే ఎన్నికల్లో మళ్ళీ అధికారం చేబట్టేందుకు ఎమ్మెల్యేలలో ఆసక్తి కొరవడింది. కేసీఆర్ హయాంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధుల వైభోగం చూసిన ఎమ్మెల్యేలు ఇప్పుడూ అలాగే ఉంటుందని అనుకుంటూ ఉండవచ్చు.ల్యాండ్,శాండ్,మైన్,వైన్.... ఇంకా అనేకానేక వ్యవహారాల్లో పదేండ్ల పాటు ఎట్లా 'లూటీ' జరిగిందో ప్రజలకు తెలుసు.చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడ్డా,పెద్దఎత్తున భూములను కొల్లగొట్టినా కేసీఆర్ మౌనంగా చూస్తూ ఉండిపోవడానికి ప్రధాన కారణం, ఆయా ప్రజాప్రతినిధుల డబ్బు అవసరాలు తెలిసి ఉండడమే.అలా వదిలిపెట్టకపోతే శాసనసభ్యులలో అసంతృప్తి పెరుగుతుందని,అది అసమ్మతిగానూ మారవచ్చునని కేసీఆర్ కు బాగా తెలుసు. అందుకే ఆయన ప్రత్యక్షంగానూ,పరోక్షంగానూ పలు 'అక్రమాల'ను ప్రోత్సహించారన్న ఆరోపణలున్నవి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు ఎమ్మెల్యేల ధనదాహానికి అడ్డంకిగా మారాయి.హైడ్రా కావచ్చు,భూభారతి కావచ్చు... శాసనసభ్యులకు,అత్యాశాపరులకు కంటగింపుగా మారినట్టు తెలుస్తోంది.

కేసీఆర్ హయాంలో 'ధరణి' పేరిట జరిగిన అక్రమాలు రిపీట్ కాకుండా 'భూభారతి' చట్టం రూపొందించడం అక్రమార్జనాపరులకు నచ్చని పని.భూభారతి పూర్తి స్థాయిలో అమలుకు ముందే 'భూముల దందా' కు పాల్పడాలని కొందరు ఎమ్మెల్యేలు భావించారేమో! పది మంది ఎమ్మెల్యేలు ఫార్మ్ హౌజ్ లో విందు సమావేశం జరపడం సాధారణ విషయమే.కానీ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వ్యతిరేకంగా సమావేశం పెట్టుకోవడం కాంగ్రెస్ పార్టీకి,రేవంత్ ప్రభుత్వానికి ఆందోళన కలిగించే ఘటన.ఒక మంత్రిపై అసమ్మతి ప్రకటన ముఖ్యమంత్రి పైనా,ప్రభుత్వంపైన కూడా తిరుగుబాటుగా ఎందుకు భావించకూడదు? ఈ ఘటన టీ కప్పులో తుపానులా కాంగ్రెస్ పార్టీలో ఎవరూ భావించడం లేదు.కొన్ని సందర్భాలలో ఉరుములు,మెరుపులు సంభవించకపోవచ్చు.హఠాత్తుగా గాలిలో మార్పు రావచ్చు.

కేసీఆర్ పాలనలో కనీసం ఇద్దరు,ముగ్గురు సొంత పార్టీ ఎమ్మెల్యేలు ఒక చోట గుమికూడితే ఎర్రవెల్లి ఫార్మ్ హౌజ్ నుంచో,ప్రగతిభవన్ నుంచో ఫోన్ వెళ్లిన సందర్భాలను కాంగ్రెస్ నాయకులు గుర్తు చేస్తున్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు,మంత్రులపైనే నిఘా పెట్టి,చివరకు వాళ్ళ ఫోన్లను ట్యాప్ చేసిన అపఖ్యాతి ఆ పార్టీ మూటగట్టుకున్నది.ప్రాంతీయ పార్టీలో అలాంటి 'కట్టడి' చర్యలు సర్వసాధారణమేనని సమర్థించుకునే వారున్నారు.కానీ జాతీయపార్టీ కాంగ్రెస్ లో ప్రజాస్వామిక వాతావరణం పుష్కలంగా ఉంటుంది కనుక ఇలా పది,పదిహేను మంది ఎమ్మెల్యేలు సమావేశం పెట్టుకోవడమో,పరస్పర కష్ట సుఖాలు చెప్పుకోవడమో మామూలు విషయంగా భావించవచ్చు.కానీ వారి ఉద్దేశం వేరుగా ఉన్నందున సమస్య చిలికి చిలికి గాలివానగా మారకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'నష్ట నివారణ'లో భాగంగా ఫిబ్రవరి 1 వ తేదీన పోలీసు కమాండ్ కంట్రోల్ లో సహచర మంత్రులతో కీలక సమావేశం నిర్వహించారు.

> **పరిపాలనా అనుభవం ఉన్న కొందరు మాజీ ఐఏఎస్,ఐపీఎస్ అధికారుల టీమ్ రేవంత్ దగ్గర లేరని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.హైడ్రా వంటి వ్యవస్థ ఏర్పాటు భవిష్యత్తు తరాలకు ప్రయోజనకరమని అందరికీ తెలుసు.రియల్ ఎస్టేట్ రంగంపై దాని ప్రభావం గురించిన అంచనా సరిగ్గా వెయ్యలేదన్న విమర్శలున్నవి.**

పది మంది ఎమ్మెల్యేలతో 'గ్రూపు' రాజకీయం చేసిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి,మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విధేయుడు, అనుచరుడు.ఆయనకు కోమటిరెడ్డి వెంకటరెడ్డి 'కోటా' కింద టికెట్టు దొరికింది. యువ పారిశ్రామిక వేత్త అయిన అనిరుధ్ రెడ్డి కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యే అయినప్పటికీ 'అసమ్మతి' నిప్పు రాజేయడం వెనుక ఉన్న సూత్రధారులపై ఊహాగానాలు సాగుతున్నవి.అనిరుధ్ విందు భేటీలో పాల్గొన్నవారిలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఎక్కువ మంది ఉండటం మరొక పరిణామం.
ఏడాదిగా పనులు జరగకపోవడం పట్ల వాళ్లు అసంతృప్తిగా ఉన్నారు.బిల్లుల విషయంలో నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందన్న విమర్శిస్తున్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై చర్యలు తీసుకోవలసిందేనని అనిరుధ్ రెడ్డి డిమాండ్ చేస్తున్నట్టు ప్రచారం సాగుతోంది.'థర్టీ పర్సెంట్ మంత్రి' అంటూ పొంగులేటిని నిందించారని కథనాలు వస్తున్నవి. మంత్రిపైన అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ ఫోన్ లో మాట్లాడారు.కలిసి మాట్లాడుకుందామని ఎమ్మెల్యేలకు ఆయన సూచించారు. రెడ్డి సామాజికవర్గ ఎమ్మెల్యేల అసంతృప్తి స్పష్టంగా కనపడడం సీఎం రేవంత్ కు ఆందోళన కలిగించే అంశం. పైగా సిఎం సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు 'ఆసమ్మతి' సమావేశంలో పాల్గొనడమూ కలవరపరచే అంశమే. బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వచ్చిన 10 మంది ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారంటూ కొన్ని నెలలుగా ప్రచారం జరుగుతూనే ఉన్నది.'కేసీఆర్ రాజకీయంగా తెలివైన నేత కనుక పొంగులేటి శ్రీనివాసరెడ్డి మోసాలను ముందుగానే పసిగట్టి పార్టీ నుంచి బయటికి పంపించేశారని,కాంగ్రెస్ పార్టీకి దిక్కులేక ఆయనను నెత్తికి ఎత్తుకున్నార'ని అనిరుధ్ వ్యాఖ్యానించినట్టు బిఆర్ఎస్ పార్టీ మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

నాయకత్వప్రతిభ అద్భుతంగా ఉన్నట్టు ప్రశంసలు పొందుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పరిపాలన అనుభవలేమి ఇబ్బందులు పెడుతున్నట్టు తాజా పరిణామాలు రుజువుచేస్తున్నాయి.పరిపాలన అనుభవం ఉన్న మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భట్టి,ఉత్తమ్,శ్రీధర్ బాబు వంటి సీనియర్లను విశ్వాసంలోకి తీసుకొని,వారిని కలుపుకొని పోవడంలో ఎక్కడో ఏదో లోపం ఉన్నట్టు కనబడుతున్నది.ఏడాది కాలమంతా ఎలాంటి అసమ్మతి మాట వినిపించలేదు.సరిగ్గా నెలాఖరులో బహిరంగ సభతో దుమ్ము దులుపుతానని కేసీఆర్ ప్రకటించిన మరునాడే అనిరుధ్ రెడ్డి 'గ్రూపు' ఏర్పడడంలో ఏదో లాజిక్ కనిపిస్తోంది.కేసీఆర్ వైపు నుంచి అలజడికి ముందే అంతర్గతంగా తమ తడాఖా చూపాలని కొందరు ఎమ్మెల్యేలు 'ప్రత్యేక' సమావేశం నిర్వహించడం రేవంత్ నాయకత్వాన్ని సవాలు చేయడమే.ఆయన నాయకత్వాన్ని ప్రశ్నించడమే.

> **ప్రజల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై వ్యతిరేకత ఎంత శాతం ఉందో ఎవరూ చెప్పలేకపోతున్నారు.అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ పార్టీ నాయకులకు క్షణమొక యుగం లాగా,అత్యంత భారంగా నడుస్తున్నందున రేవంత్ ప్రభుత్వంపై 'కృత్రిమ వ్యతిరేకత'ను సృష్టించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.**

కాగా దేశంలో అన్ని పార్టీలు కుటుంబ వ్యవస్థలుగా, ప్రైవేటు ఆస్తులుగా మారాయి.ప్రజాస్వామ్యం పార్టీల చేతుల్లో ఉంది,పార్టీలు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయి.అభ్యర్థుల ఎంపిక నుంచి పోలింగ్ వరకు ఎన్నికలు పెద్ద ప్రహసనంగా మారినవి.గతంలో అభ్యర్థుల ఎంపికకు వృత్తి, విద్య,సామాజిక సేవ,కుటుంబ నేపథ్యం తదితర అంశాలు అర్హతలుగా ఉండేవి.ఇప్పుడు కులం,డబ్బు మాత్రమే ప్రాథమిక అర్హతలు. ఆయా అభ్యర్థులకు చెందిన కులం ఓట్లు ఎన్ని ఉన్నాయి,ఎన్ని కోట్లు ఖర్చు పెడతారని ఆలోచిస్తున్నాయి.దీంతో ధన ప్రభావం బాగా పెరిగి ఎంత డబ్బు పెడితే అన్ని ఓట్లు అనే భ్రమల్లో అన్ని పార్టీలు ఉన్నాయి.కార్పొరేట్ కంపెనీలకు కన్సల్టెన్సీలను పెట్టుకుంటున్న తరహాలో రాజకీయ పార్టీలు వ్యూహకర్తలను పెట్టుకునే కొత్త సంప్రదాయాలకు తెరతీశాయి.కోట్లు ఖర్చుపెట్టి అధికారమే

> **కేసీఆర్ పాలనలో కనీసం ఇద్దరు,ముగ్గురు సొంత పార్టీ ఎమ్మెల్యేలు ఒక చోట గుమికూడితే ఎర్రవెల్లి ఫార్మ్ హౌజ్ నుంచో,ప్రగతిభవన్ నుంచో ఫోన్ వెళ్లిన సందర్భాలను కాంగ్రెస్ నాయకులు గుర్తు చేస్తున్నారు.బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు,మంత్రులపైనే నిఘా పెట్టి,చివరకు వాళ్ళ ఫోన్లను ట్యాప్ చేసిన అపఖ్యాతి ఆ పార్టీ మూటగట్టుకున్నది.**

పరమావధిగా వ్యూహకర్తలను పెట్టుకుంటున్నాయి అభ్యర్థులకు ఓట్ల కొనుగోళ్లకు ఎంత ఖర్చవుతుందో, టికెట్ తెచ్చుకోవడానికి ఇంచుమించు అంతే ఖర్చవుతోంది.పార్టీ ఫండ్ రూపంలోనో, మరో రూపంలోనో ధనిక అభ్యర్థులు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు.సామాన్యులకు, సమర్థులకు ఎన్నికల బరిలో చోటులేదు. శాసనసభకు ఎన్నిక కావడానికి సుమారు 50 కోట్లు ఖర్చు చేస్తున్నారు.ఇంత ఖర్చు చేసిన తర్వాత తిరిగి వాటిని ఎలా సంపాదించుకోవాలో ఆలోచిస్తారు. పార్టీలు ఫిరాయిస్తున్నా,కోట్లు కొల్లగొడుతున్నా,నేరచరిత్ర ఉన్నా ప్రజలు పట్టించుకోవడం మానేసి చాలా కాలమైంది.ఎన్నికల్లో పోటీకి నిలబడినప్పుడు ప్రకటించిన ఆస్తులు ఐదేళ్ల తర్వాత రెట్టింపు అవుతున్నాయి.

> **గడచిన మూడు దశాబ్దాలుగా ఎన్నికల్లో అభ్యర్థులు పెడుతున్న ఖర్చు ఎన్నో రెట్లు పెరిగింది.దీని తల్లి వేరు చంద్రబాబు నాయుడు,డాక్టరు వైఎస్ రాజశేఖరరెడ్డి అయితే ధనబలంతో ఏమైనా చేయగలమన్న కొత్త ఒరవడికి నాంది పలికిన నాయకుడు కేసీఆర్.**

పారిశ్రామికవేత్తలు,వ్యాపారవేత్తలే చట్టసభల్లో ఎక్కువమంది ఎన్నికవుతున్నందున వాళ్ళు తమ వ్యాపారాలను సుస్థిరం చేసుకోవడానికి ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తున్నారు.పేదరికం పేరిట ఉచిత పథకాల ముసుగులో కేసీఆర్ హయాంలో విచ్చలవిడిగా ఖర్చు చేసినందున దాని భారమంతా రేవంత్ ప్రభుత్వంపై పడింది.అభివృద్ధి,సంక్షేమం పేరిట ఖర్చు చేసి ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడంతో చాలామంది ఎమ్మెల్యేలు,వారి బాజా భజంత్రీలు వందలాది కోట్లకు పడగెత్తినట్టు ఆరోపణలున్నవి.బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సన్నిహితుడు,సలహాదారుగా పేరుమోసిన వ్యక్తి ఒకరు కనీసం వెయ్యి కోట్లకు పైగా భూములు,ఇతర సహజవనరులను కొల్ల గొట్టారని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆరోపిస్తున్నవి.

అలాంటి అపవాదు తమ ప్రభుత్వంపై రాకూడదని సీఎం రేవంత్ రెడ్డి అనుకుంటున్నారు.కానీ ఏది మంచో,ఏది చెడో చెప్పగలిగినవారు ఎవరూ ఆయన దరిదాపుల్లో లేరన్న విమర్శ ఉన్నది.పరిపాలనా అనుభవం ఉన్న కొందరు మాజీ ఐఏఎస్,ఐపీఎస్ అధికారుల టీమ్ రేవంత్ దగ్గర లేరని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.హైడ్రా వంటి వ్యవస్థ ఏర్పాటు భవిష్యత్తు తరాలకు ప్రయోజనకరమని అందరికీ తెలుసు. రియల్ ఎస్టేట్ రంగంపై దాని ప్రభావం గురించిన అంచనా సరిగ్గా వెయ్యలేదన్న విమర్శలున్నవి.అలాగే సీఎం ఆలోచనకు భిన్నంగా ఎమ్మెల్యేలు,మంత్రులు,పార్టీ నాయకుల ఆలోచనలున్నవి.తమ ఆదాయ మార్గాలు మూసుకుపోయాయన్న బాధ వారిని తొలచివేస్తోంది.వాళ్లందరికీ తక్షణ ప్రయోజనాలు కావాలి కానీ,భవిష్యత్తు తరాల గురించి ఆందోళన ఎందుకు ఉంటుంది.ఇక రుణమాఫీ కింద 18 వేల కోట్లకు పైగా పంపిణీ చేసినా రావలసిన మైలేజీ రాలేదు.ప్రభుత్వానికి అనుకూలంగా జరగవలసినంత ప్రచారమూ లేదు.రుణమాఫీ కన్నా 'రైతు భరోసా' మొదలు పెట్టి,ఆర్థిక వనరుల పరిమితుల దృష్ట్యా రుణమాఫీని జాప్యం చేస్తే బాగుండేదని రేవంత్ శ్రేయోభిలాషులు కొందరు అంటున్న మాట.

ఇదిలా ఉండగా మంత్రుల పీఏలు ఫోన్ ఎత్తడం లేదని అప్పుడే ఒక ప్రచారం మొదలయ్యింది.కేసీఆర్ హయాంలో ఇలాంటి వాతావరణం అందరికీ అనుభవమే.మరి ప్రజాపాలన అంటే ప్రజలకు మంత్రులు,ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండాలని కోరుకోవడం తప్పేమీ కాదు.అందుకు విరుద్ధంగా పరిస్థితులు కనిపిస్తున్నాయని,'మార్పు' కేవలం మాటల్లోనే కాదని ఒకరిద్దరు సర్పంచ్ లు నాతో మాట్లాడుతూ అన్నారు. ఇటువంటి విమర్శలు చిన్నవే అయినా సరిదిద్దుకోవలసిన అవసరం ఉన్నది. విధాన నిర్ణయాలు ఒంటరిగా తీసుకోవడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ మద్దతుదారులంటున్నారు.ఇదే నిజమైతే మంత్రులంతా సీఎంకు మద్దతుగా,బలంగా ఆయన వెనుక ఎందుకు నిలబడడం లేదు.బహుశా క్రెడిట్ అంతా రేవంత్ రెడ్డికి దక్కుతుండడం కొందరు సీనియర్ మంత్రులకు ఇష్టం లేకపోవచ్చు. ముఖ్యమంత్రిగా ఎవరు ఉన్నా పరిపాలనా పరమైన వైఫల్యాలు,సాఫల్యాలకు ఆయనే బాధ్యుడవుతారని సీనియర్లకు తెలియదా? నటిస్తున్నారా?

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

## మహాకుంభమేళాకు మోదీ

### నేడు షెడ్యూల్ ఖరారు.. పోటెత్తుతున్న భక్తులు

మహా: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరగుతున్న అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహాకుంభ మేళా ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. దేశం నలుమూలల నుంచి కోట్లాది జనం కుంభమేళాకు చేరుకొని పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. పలు దేశాల నుంచి కూడా ఔత్సాహికులు తరలివస్తున్నారు. ఇదిలా ఉంటే.. ప్రధాని నరేంద్ర మోదీ కుంభమేళాకు వెళ్లనున్నారు. త్రివేణి సంగమంలో ఆయన పుణ్యస్నానం చేసేందుకు షెడ్యూల్ ఖరారైంది. ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. మంగళవారం రథసప్తమి రోజు లక్షలాదిగా భక్తులు స్నానాలు ఆచరించారు.



# కులగణనతో దేశానికి ఆదర్శ సీఎంగా నిలిచిన రేవంత్ రెడ్డి

**రిజర్వేషన్ల అమలు చారిత్రక ఘట్టం..టీ పీసీసీ సీనియర్ నేత వెంకటేష్**



**మహా :** ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కులగణన పూర్తి చేసి మాట నిలబెట్టుకున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంచార్జి కె . వెంకటేష్ అన్నారు. బీసీల సామాజిక, ఆర్థిక, కుల సర్వే రాష్ట్రంలో చేపట్టి స్థానిక ఎన్నికల్లో బీసీలకు రాజకీయ న్యాయం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లు 42 శాతం తగ్గకుండా అవసరమైతే ఎక్కువ ఇస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని వెంకటేష్ పేర్కొన్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లు అమలు చేయడం చారిత్రాత్మక ఘట్టమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అనంతరం కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఆకాంక్ష మేరకు రాష్ట్రంలో కులగణన జరిపించి దేశానికి ఆదర్శ సీఎంగా రేవంత్ రెడ్డి నిలచారన్నారు.ఇందిరమ్మ పాలనను గుర్తు చేస్తూ ప్రజా పాలన కొనసాగిస్తూ ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బీసీల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. బీసీ కులగణన పూర్తి అయిన నేపథ్యంలో రేపు రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యావత్ బీసీ సమాజం కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులను ఎన్నుకోని సోనియా గాంధీ,రాహుల్ గాంధీ లకు బహుమతిగా ఇవ్వాలని వెంకటేష్ పిలుపు నిచ్చారు. ప్రభుత్వ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సైనికుడిలా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వెంకటేష్ పేర్కొన్నారు.

# భూముల వివరాలు అడిగితే.. కేసీఆర్, కేటీఆర్‌కు భయమెందుకు?

## అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

- 50 రోజుల సర్వేలో బీఆర్ఎస్ ముఖ్యనేతలే వివరాలు ఇవ్వలే
- బలహీనవర్గాలకు హక్కులివ్వడం మోదీకి ఇష్టం లేదు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం సీట్లు ఇస్తాం
- అన్ని పార్టీలు బీసీలకు 42 శాతం సీట్లు ఇవ్వాలి
- అసెంబ్లీలో కులగణన నివేదిక ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి



**హైదరాబాద్, మహా:** భూముల వివరాలు అడిగితే.. కేసీఆర్, కేటీఆర్ కు భయమెందుకు? బీఆర్ఎస్ నేతలు సర్వేలో ఎందుకు పాల్గొనలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలదీశారు. సామాజిక, ఆర్థిక సర్వే నివేదికలు సభలో ప్రవేశపెట్టిన ఆయన కొందరు ఈ నివేదికలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, బిసిల జనాభా గత సర్వే కంటే 5శాతం పెరిగిందన్నారు. "కులగణన సర్వే 50 రోజులు జరిగితే .. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పద్మారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ భాజపా ఎంపీ డీకే అరుణ సర్వేలో పాల్గొనలేదు. సర్వేలో భూమి వివరాలు చెప్పాలని ఫామ్‌లో ఒక కాలమ్ ఉంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఎవరూ సమాచారం ఇవ్వలేదు. 3.54కోట్ల మంది సర్వేలో పాల్గొంటే.. ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ భూముల వివరాలు ఇచ్చారు. కానీ, భూముల వివరాలు అడగ్గానే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు భయపడి సర్వేలో పాల్గొనలేదు" అని అన్నారు.

**గత నివేదిక ఎందుకు బయటపెట్టలేదు**

"గత ప్రభుత్వం సమగ్రసర్వే నివేదికను ఎందుకు భయటపెట్టలేదు? స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం సీట్లు ఇస్తాం. రాజకీయాల్లో బీసీలకు మేం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడి నుంచి మాట తీసుకున్నా. అన్ని పార్టీలు బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వాలి. కులగణన సర్వే డేటాను సంక్షేమ పథకాల విధానాల తయారీకి వాడతాం. 1931 నుంచి ప్రతి పదేళ్లకు ఓసారి జనగణన చేపట్టారు. 2014లో నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత ఇప్పటివరకు జనగణన జరగలేదు. 2021 నుంచి ఇప్పటి వరకు సర్వే చేయకుండా వదిలేశారు. బలహీనవర్గాలకు వారి హక్కులు ఇవ్వడం భాజపాకు ఇష్టం లేదు. ప్రధాని మోదీ .. బలహీనవర్గాలకు ఏదైనా సాయం చేయాలనుకుంటే 2021లో లెక్కించాల్సిన జనాభాను ఇంతవరకు ఎందుకు చేయలేదు" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

**రాహుల్ మాట ప్రకారం**

బీసీ లెక్కలు తేల్చి వారికి అవకాశాలు కల్పిస్తామని రాహుల్ గాంధీ పాదయాత్రలో హామీ ఇచ్చారని.. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తాము కుల గణన చేపట్టామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో కమిటీ వేసి ప్రక్రియను ముందుకు తీసుకువెళ్ళామని తెలిపారు. కర్నాటక, బిహార్ సహా వివిధ సర్వేలను అధ్యయనం చేశామని తెలిపారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం సర్వే చేపట్టామని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా ఈ సర్వేను నిర్వహించామన్నారు. సర్వేల తయారీలో వివిధ సంఘాలు, మేధావుల అభిప్రాయాలు తీసుకున్నామని.. 75 అంశాల ప్రాతిపదికగా సర్వేను నిర్వహించామని చెప్పారు. నవంబర్ 9 నుంచి 50 రోజుల పాటు సర్వే నిర్వహణ జరిగిందని తెలిపారు. తెలంగాణలో 1.12 కోట్ల కుటుంబాల సర్వే జరిగిందని వెల్లడించారు. పట్టణాల్లో 45.15 లక్షల కుటుంబాల్లో సర్వే జరుగగా.. గ్రామాల్లో 66.39 లక్షల కుటుంబాల్లో సర్వే జరిగిందన్నారు. కులసర్వే డేటాను సంక్షేమ విధానాల తయారీకి వాడుతామని సీఎం తెలిపారు.

**రూ.161కోట్ల ఖర్చు**

పకడ్బందీగా కులగణన నిర్వహించామని.. ఇందుకోసం రూ.161 కోట్లు ఖర్చు చేసి సర్వే చేశామని రేవంత్ తెలిపారు. ఇది ఒక మోడల్ డాక్యుమెంట్‌గా పనిచేస్తుందని తెలిపారు. పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించేందుకు కేబినెట్ ఆమోదం తరువాత సభలో ప్రవేశపెట్టామన్నారు విద్యా ఉద్యోగ ఉపాధి రాజకీయ అవకాశాలు కల్పించడానికి సర్వే పని చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వాన్ని అన్ని పార్టీలు అభినందించాలని ముఖ్యమంత్రి అన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు**



**నిజామాబాద్, మహా:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. స్థానికంగా నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, రోగులకు అందిస్తున్న చికిత్సల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఎంత మంది రోగులు చికిత్స కోసం ఆసుపత్రికి వస్తున్నారనే వివరాలను రిజిస్టర్లో పరిశీలించారు. గర్భిణీలకు క్రమం తప్పకుండా ఏ.ఎన్.సీ పరీక్షలు చేయాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యులకు సూచించారు. స్థానికంగా అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

**బీసీ కుల గణన గురించి గొప్పచెప్పే రాహుల్**

# తెలంగాణ సీఎం పదవి బీసీలకు ఇవ్వాలి

- మిగిలిన ఆరు మంత్రి పదవులు కూడా బీసీలకే ఇవ్వాలి
- క్యాబినెట్ లో మైనారిటీ ఎందుకు లేరో చెప్పాలి
- లోక్ సభలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు



**మహా :** బీసీ కుల గణనపై లోక్ సభలో గొప్పగా చెప్పిన రాహుల్ గాంధీకి నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే సీఎం పదవిని బీసీలకు ఇవ్వాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం పై పార్లమెంటులో ప్రసంగించిన రఘునందన్ రావు సగం జనాభా ఉన్న బీసీలకు రెండే మంత్రి పదవులు ఇచ్చి జబ్బలు చరుచుకుంటున్నారని మండిపడ్డారు. "ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాస సంత్రస్తులై యారంభించి పరిత్యజించుదురు విఘ్నాయత్తులై మధ్యముల్, ధీరుల్ విఘునిహన్య మానులగుచు ధ్రుత్యున్నతొత్సాహులై ప్రారబ్ధార్ధము లుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధల్ గావునన్ అంటూ ఏనుగు లక్ష్మణ కవి పద్యాన్ని ఉదహరించిన రఘునందన్ రావు ప్రధాని నరేంద్ర మోడీ మాటలు నిజం చేస్తాడు. రాహుల్ గాంధీ కేవలం మాటలు మాత్రమే చెప్తారని వ్యాఖ్యానించారు. మోడీ క్యాబినెట్ లో 27 మంది ఓబీసీ, 8 మంది దళిత, 8 మంది మహిళా మంత్రులు ఐదుగురు మైనారిటీ మంత్రులు ఉన్నారని రఘునందన రావు పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు ఏమీ రాలేదంటూ తెలంగాణ ఏమీ రాలేదంటూ పత్రికల్లో రావడం బాధాకరమన్నారు. ఒక్క ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టుకే ఇరవై వేల కోట్లకు పైగా కేటాయింపులు జరిగాయన్నారు. రైతులకు,ఉపాధి హామీ లాంటి పథకాలకు బడ్జెట్ పెంచిన ఘనత మోడీ సర్కారుదేనని పేర్కొన్నారు. మధ్య తరగతి ప్రజల గోడు విన్నది కేవలం మోడీ మాత్రమేనని, గతంలో ఉన్న పలకులు పేదలను కేవలం ఓట్ల కోసం వాడుకుని వదిలేశారని మండిపడ్డారు.



# సచివాలయాన్ని పేల్చేస్తా

- 3 రోజులుగా బెదిరింపు కాల్స్
- లంగర్‌హౌజ్‌కు చెందిన సయ్యద్ మీర్ మహ్మద్ అలీని నిందితుడిగా గుర్తించిన పోలీసులు

**హైదరాబాద్, మహా:** గత మూడు రోజులుగా తెలంగాణ సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పదే పదే బెదిరింపు కాల్స్ రావడం సంచలనంగా మారింది. సెక్రటేరియట్‌ను పేల్చేస్తానని ఆ వ్యక్తి పదే పదే కాల్స్ చేస్తూ అధికారులకు తీవ్రంగా విసుగు తెప్పించాడు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. రంగంలోకి దిగిన పోలీసులు.. నిందితుడు చేసిన ఫోన్ నంబర్ పట్టుకుని.. అతడి ఆచూకీని కనిపెట్టారు. ఆ నిందితుడిని అదుపులోకి తీసుకుని.. బెదిరింపు కాల్స్ ఎందుకు చేశావని విచారణ చేపడుతున్నారు. హైదరాబాద్ లంగర్‌హౌజ్‌కు చెందిన సయ్యద్ మీర్ మహ్మద్ అలీ.. అనే వ్యక్తి గత 3 రోజులుగా సెక్రటేరియట్‌లోని సీఎం ఆఫీస్ అర్జీలు, ఫిర్యాదుల విభాగానికి ఫోన్ చేసి బెదిరిస్తున్నాడు. తాను సచివాలయాన్ని పేల్చేస్తానని హెచ్చరించాడు. మొదట ఏదో ఫేక్ కాల్ అని భావించిన సచివాలయ అధికారులు.. పట్టించుకోలేదు. అయినా సయ్యద్ మీర్ మహ్మద్ అలీ.. వినకుండా 3 రోజులు వరుసగా ఫోన్ చేశాడు. చివరికి విసిగిపోయిన సెక్రటేరియట్ అధికారులు సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. రంగంలోకి దిగారు. అతడు చేసిన ఫోన్ నంబర్ ఆధారంగా.. నిందితుడు సయ్యద్ మీర్ మహ్మద్ అలీ అని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

# రేవంత్ వర్సెస్ కేటీఆర్

**మాటల మంటలు**



**హైదరాబాద్, మహా:** అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ల మధ్య మాటల మంటలుపుట్టాయి. ఢీ అంటే ఢీ అనుకున్నారు నేతలు. ఒక దశలో సీఎం కేటీఆర్ మైక్ కట్ చేయమని చెప్పారు. గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేతో పోలిస్తే.. ఇప్పుడు బీసీల లెక్కను తక్కువ చేసి చూపించారని కేటీఆర్ ఆరోపించారు. 2014లో చేపట్టిన సర్వే రిపోర్టును వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టామని.. అదే రిపోర్ట్ బిజెపి ఎమ్మెల్యే వద్ద,సీఎం వద్ద ఉందన్నారు. అప్పటికి ఇప్పటికి బీసీల జనాభాను 5 శాతం తగ్గించారని ఆరోపించారు. ఈ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం లేకుండా పోయిందన్నారు. తాము నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారా అని ప్రశ్నించారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. నాడు ఊరు పేరు తెలియని వారితో సర్వేను నిర్వహించారని అన్నారు. కేవలం రికార్డు కోసమే సర్వేను చేపట్టారని అన్నారు. సర్వే రిపోర్టుపై కేబినెట్‌లో ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. అర్థం పర్థం లేని మాటలతో ప్రయోజనం లేదనే విషయాన్ని గుర్తించాలన్నారు. సర్వేలో పాల్గొనని బీఆర్ఎస్ సభ్యులకు మైక్ ఇవ్వొద్దని స్పీకర్‌ను కోరారు. వీళ్లు చెబుతున్న రిపోర్టు అఫీషియల్ వెబ్‌సైట్‌లో లేదని అన్నారు. నాడు సర్వే చేసిన ఎన్యుమరేటర్లు ఎవరు..? అని వివరాలు వెల్లడించారా అని ప్రశ్నించారు. ప్రజల వ్యక్తిగత వివరాలు ఉండడంతో కులగణన రిపోర్టును పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదని వివరించారు. బీసీలకు న్యాయం చేయాలని చూస్తుంటే ఇన్ని విమర్శలా అంటూ ఆగ్రహం ప్రదర్శించారు.



## ఫ్యాన్స్ సిద్ధం కండమ్మా..!

**మహా:** అభిమానులు ఎవరైతే తనను కలవాలని, మాట్లాడాలని తాపత్రయపడుతున్నారో.. అలాంటి వారి కోసం ఒక ప్రత్యేక ప్రకటన జారీ చేశారు ఎన్టీఆర్. తనపై అభిమానులు చూపిస్తున్న గౌరవానికి , అపారమైన ప్రేమకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. తనను కలుసుకోవాలని ఎదురు చూస్తున్న అభిమానుల ఆసక్తిని అర్థం చేసుకొని, త్వరలోనే సజావుగా ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి, తనను వ్యక్తిగతంగా కలవాలనుకున్న వారిని కలవడానికి నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమం కోసం అన్ని అనుమతులు పొందుతూ పోలీస్ డిపార్ట్మెంట్ అలాగే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని, శాంతిభద్రతల సమస్యలు రాకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇంత పెద్ద సమావేశం నిర్వహించడానికి కొంత సమయం కూడా అవసరం అవుతుంది. కాబట్టి అభిమానులు దయచేసి ఓర్పుగా ఉండాలని ఎన్టీఆర్ కోరుతున్నారు.

# మినిట్స్ ప్రిపేర్ కాలే

- ప్రత్యేక సమావేశంలో షాకింగ్ అప్డేట్
- కేబినెట్ సమావేశం జరుగుతోంది..
- మినిట్స్ ప్రిపరేషన్ కు కొంత సమయం పడుతుందన్న శ్రీధర్ బాబు
- ప్రారంభమైన 2నిమిషాలకే వాయిదా



**హైదరాబాద్, మహా:** అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ప్రారంభం కాగానే వాయిదా పడింది. మంత్రిమండలి సమావేశం కొనసాగుతుండటంతో సభను వాయిదా వేయాలని మంత్రి శ్రీధర్‌బాబు స్పీకర్‌ను కోరారు. మినిట్స్ తయారీకి సమయం పడుతుందని వెల్లడించారు. దీంతో స్పీకర్ ప్రసాద్ కుమార్.. సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. అయితే ప్రత్యేక సమావేశం అని చెప్పి ప్రభుత్వం సన్నద్ధం కాకపోవడం, మినిట్స్ ప్రిపరేషన్ కు సమయం పడుతుందని అప్డేట్ చేయడంపై ఎమ్మెల్యేలు షాక్ కు గురయ్యారు. ప్రారంభంకాగానే సభను వాయిదా వేయడంపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.




# కేసీఆర్‌కు ప్రధాని మోదీ లేఖ

**సోదరి మృతికి సంతాపం**

**మహా, హైదరాబాద్ :** మాజీ మంత్రి కేసీఆర్ కు.. ప్రధానీ మోదీ లేఖ రాశారు. కొద్ది రోజుల క్రితం కేసీఆర్ సోదరి మృతిచెందడంపై ఆయన సంతాపాన్ని వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అయితే దీనిపై ప్రధాని మోదీ సంతాపాన్ని లేఖ ద్వారా తెలియజేశారు. కాగా కేసీఆర్ సోదరీ సకలమ్మ ఇటీవల అనారోగ్య కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంగతి తెలిసిందే. సోదరి మరణాన్ని చింతిస్తున్నట్లు మోదీ పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు, మీకు సానుభూతి తెలుపుతున్నానని పీఎం మోదీ కేసీఆర్‌కు లేఖలో వివరించారు. సోదరి జ్ఞాపకాలు మీ నుంచి ఎప్పటికీ దూరం కావని అన్నారు. ఆ భాధ నుంచి త్వరగా కోలుకోవాలని, ప్రజా సేవలో నిమగ్నమవ్వాలని మోదీ లేఖలో ఆకాంక్షించారు. ప్రధానీ మోదీ లేఖ రాసిన విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ తమ ఎక్స్ ఖాతాలో షేర్ చేసింది.

# బీజేపీ ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ మద్దతు..

**శాసనసభలో ఆసక్తికర ఘటన**



**మహా:** కులగణన, ఎస్సీ వర్గీకరణపై చర్చించేందుకు ప్రత్యేకంగా సమావేశమైన తెలంగాణ అసెంబ్లీలో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. కులగణన సర్వేపై చర్చ సందర్భంగా బీజేపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. సర్వేలో బీసీల జనాభా తగ్గిందన్నారు. కులగణనలో పలు తప్పులు జరిగాయన్నారు. సమగ్రంగా సర్వే జరగలేదన్నారు. ప్రభుత్వం నిర్వహించిన సర్వేపై ప్రజల్లో ఎన్నో అనుమానాలున్నాయన్నారు. 2014 సమగ్ర కుటుంబ సర్వే లెక్కలతో పోల్చిచూస్తే ప్రస్తుత సర్వేలో బీసీ జనాభా తగ్గిందన్నారు. తన ఇంటికి సర్వేకు సంబంధించి రెండు స్టిక్కర్లు అంటించారని, సర్వేలో అనేక తప్పులు జరిగాయని, సమగ్రంగా జరగలేదని, పూర్తిస్థాయిలో ప్రజలు కులగణనలో పాల్గొనలేదని పాయల్ శంకర్ పేర్కొన్నారు.దీనికి సీఎం రేవంత్ రెడ్డి కౌంటరిచ్చారు. 50రోజుల పాటు ఎంతో బాధ్యతాయుతంగా సర్వేచేశారని, పాయల్ శంకర్ ను బిఆర్ఎస్ నేతలు ఖరాబుచేశారన్నారు. ప్రజల్లో అపోహలు సృష్టించేలా సభలో మాట్లాడవద్దన్నారు. ఈ లెక్కలకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహిస్తుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే చట్టసవరణ జరగాల్సి ఉంటుందని, కానీ సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 42 శాతం సీట్లు బీసీ అభ్యర్థులకు కేటాయిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. పాయల్ శంకర్ ప్రసంగానికి మంత్రులు మధ్యలో స్పందించగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభ్యంతరం తెలిపారు.

## జిల్లా కోర్టులకు జడ్జిల నియామకం

**మహా, హైదరాబాద్ :** తెలంగాణలో జిల్లా కోర్టులకు జడ్జిలను హైకోర్టు నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని 30 జిల్లాలకు జిల్లా జడ్జిలను నియమిస్తూ హైకోర్టు నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేలా పలు జిల్లాలకు జడ్జిలను హైకోర్టు నియమించింది. ఈ మేరకు వారికి కీలక ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్ జిల్లా కోర్టుకు.. ఎల్ జస్టిస్ సుజోయ్ పాల్, రంగారెడ్డి జిల్లాకు జస్టిస్ పి. సామ్ కోశి, మేడ్చల్‌మల్కాజిగిరికి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి నియమితులయ్యారు. మిగతా జిల్లాలకు కూడా జడ్జిలను నియమించారు.

# బెంగాల్‌ను బంగ్లాగా మార్చండి

**తృణమూల్ మరోసారి డిమాండ్**



**మహా:** పశ్చిమబెంగాల్ పేరును 'బంగ్లా'గా మార్చాలనే అంశాన్ని తృణమూల్ కాంగ్రెస్ మరోసారి లేవనెత్తింది. రాష్ట్ర సాంస్కృతిక వారసత్వం, చరిత్రను ప్రతిబింబించేందుకు ఈ మార్పు తప్పని సరిని పేర్కొంది. టీఎంసీ నేత రితబ్రత బెనర్జీ రాజ్యసభ జీరో అవర్‌లో మంగళవారంనాడు ఈ అంశాన్ని ప్రస్తావించారు. రాష్ట్రం పేరు మార్పును ప్రతిపాదిస్తూ చేసిన తీర్మానాన్ని పశ్చిమబెంగాల్ అసెంబ్లీ 2018లో ఆమోదించిందని, అయితే ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని అన్నారు.

## తెలంగాణకు కేంద్రం కేటాయింపులు సంతృప్తికరం

■ బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం..పీఎం, కేంద్ర ఆర్థికమంత్రిల చిత్రపటాలకు క్షీరాభిషేకం



**ములుగు,మహా :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణకు సైతం సముచిత స్థానం కల్పించిందని, ప్రతిపక్షాలు విమర్శలు చేయడం తగదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. మంగళవారం ములుగులోని పార్టీ జిల్లా కార్యాలయంలో మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బలరాం మాట్లాడుతూ.. పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన బడ్జెట్ మధ్యతరగతి కుటుంబాల ప్రయోజనాలకు అనుకూలంగా ఉందన్నారు. గత కాంగ్రెస్ పాలనలో అప్పటి ఆర్థిక మంత్రి రూ.16లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెడితే ఈసారి కేంద్రం రూ.47.65కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. ఏడాదికి రూ.12లక్షల ఆదాయం ఉన్నవారికి పన్ను మినహాయింపు చేశారని సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రానికి రూ.25,639 కోట్లు వాటాగా రానున్నాయన్నారు. కేంద్రం ద్వారా హైదరాబాద్ లో ఎయిమ్స్ ఆసత్రి, రామగుండం, హైదరాబాద్ లో ఆస్పత్రుల నిర్మాణం, సమ్మక్క, సారలమ్మ జాతీయ గిరిజన విశ్వ విద్యాలయానికి నిధుల కేటాయింపు, ప్రసాద్ పథకం ద్వారా రామప్ప ఆలయ అభివృద్ధికి రూ.62కోట్లు, భద్రాచలం అభివృద్ధికి రూ.42కోట్లు, మినీ మేడారం జాతరకు రూ.21కోట్లు, హైదరాబాదులో కొమరం భీమ్ గిరిజన మ్యూజియం, నిజాంబాద్ జిల్లాకు జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు, ఆయుష్మాన్ భారత్ నిధుల పెంపు తదితర అభివృద్ధి నిధులు మంజూరు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ బీజేపీ పై బురదజల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. అనంతరం రెండోసారి బీజేపీ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన సిరికొండ బలరాం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జవహర్ లాల్ లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూక్య జవహర్ లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి శీలమంతుల రవీంద్రా చారి, ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్ రావు, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి గంగిశెట్టి రాజ్కుమార్, కార్యాలయ కార్యదర్శి రవిరెడ్డి, నాయకులు సునీల్, వెంకట్ రెడ్డి, బైకాని మహేందర్, ఏరువా పాపిరెడ్డి, యాద సంపత్, విక్రం, బొజ్జల కిరణ్, రవీందర్రావు, శ్రీహరి,లక్ష్మి, సారయ్య, వెంకట్ రెడ్డి, మధు, రాజేష్, కొమురెల్లి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మన అగ్రిటెక్ లో నూతన డ్రోన్ స్ప్రేయర్ ఆవిష్కరణ

■ మన అగ్రిటెక్ ఎండి పాశికంటి రమేష్..ముఖ్య అతిథిగా మార్కెట్ గ్రేడ్ సెక్రటరీ,ఇతర ప్రముఖులు



**వరంగల్, మహా:** సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుని నేటి ప్రపంచంలో ఎంతో ముందడుగు వేస్తుంది అనుకున్నదే తడవుగా నిమిషాల్లో అనుకున్న పనిని పూర్తి చేసే విధంగా ఆధునికరన చెందిందంటే అతిశయోక్తి కాదేమో. ప్రస్తుత వ్యవసాయ రంగంలో సైతం సాంకేతిక పరిజ్ఞానంతో ఒక్కో అడుగు ముందుకు వేస్తున్న తరుణంలో వ్యవసాయ రంగాన్ని మరింత సులభతరం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చే ఆమోదించబడిన ప్రముఖ సంస్థ దక్ష కంపెనీ వారు మన అగ్రిటెక్ అధినేత పాషికంటి రమేష్ నేతృత్వంలో మంగళవారం వరంగల్ ఎనమాముల వ్యవసాయ మార్కెట్ లోని మన అగ్రిటెక్ సంస్థ లో డ్రోన్ స్ప్రేయర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కెట్ గ్రేడ్ సెక్రటరీ నిర్మల తోపాటు మార్కెట్ మాజీ డైరెక్టర్ పిన్నింటి వెంకట్ రావు,నూతనకల్ పిఏసిఎస్ చెర్మెన్ జయసుధ ఇతర ప్రముఖులు హాజరై రిబ్బన్ కట్ చేసి నూతన డ్రోన్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దక్ష కంపెనీ ప్రతినిధులు రైతులకు డ్రోన్ ప్రదర్శనను నిర్వహించి పూర్తి అవగాహన కల్పించారు. అనంతరం మన అగ్రిటెక్ అధినేత పాషికంటి రమేష్ మాట్లాడుతూ..వ్యవసాయంలో రైతులు ఆధునీకరణ దిశగా సాగుతూ ఎన్నో అద్భుతాలను సృష్టించడంలో మన అగ్రిటెక్ కీలక పాత్ర పోషిస్తుందని అందులో భాగంగానే నేడు మన అగ్రిటెక్ లో నూతన డ్రోన్ ప్రారంభించడం జరిగిందని అత్యాధునిక ఫీచర్స్ తోపాటు రైతుల సమయం,ఖర్చు ఆదా చేసుకోవడమే కాకుండా ఇతర రైతులకు స్ప్రే చేయడం ద్వారా అధిక మొత్తంలో సంపాదించవచ్చన్నారు. డ్రోన్ స్ప్రేయర్స్ పూర్తి వివరాలు అలాగే డ్రోన్ కావలసిన వారు మన అగ్రిటెక్ ను సంప్రదించవచ్చునని తెలిపారు. డ్రోన్ స్ప్రేయర్ ప్రత్యేకతలు.. కేంద్ర ప్రభుత్వంచే ఆమోదించబడిన ప్రముఖ దక్ష కంపెనీ వారి డ్రోన్ స్ప్రేయర్ నేడు మన అగ్రిటెక్ లో ఆవిష్కృతమైంది ఈ డ్రోన్ 10లీటర్ల నీటి సామర్థ్యంతో రెండు బ్యాటరీలు అందిస్తున్నారు.బ్యాటరీలను ఒక్కసారి ఛార్జ్ చేస్తే 3ఎకరాలకు వస్తుంది ఒక ఎకరా కేవలం 5 నుండి 7 నిమిషాల వ్యవధిలో పిచికారి చేయడం జరుగుతుందని తెలిపారు.



## మినీ మేడారం జాతరకు ప్రతీ రోజు 100 బస్సులు

■ ఐలాపూర్ కు సైతం ప్రత్యేక బస్సులు
■ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయ భాను

**ములుగు, మహా :** ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జరుగనున్న సమ్మక్క, సారలమ్మ మినీ జాతరకు హన్మకొండ బస్టాండ్ నుంచి 100 బస్సులు నడుపనున్నామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయ భాను ప్రకటనలో తెలిపారు. ఈనెల 9వతేదీ నుంచి 16వ తేదీ వరకు టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రతీ రోజు 400ల ట్రిప్పులను నడుపనున్నట్లు వెల్లడించారు. ఉదయం 6గంటల నుంచి బస్సులు నడుస్తాయని, ఏటూరునాగారం మండలం ఐలాపూర్ కు సైతం ఊరట్టం, కొండాయి మీదుగా మూడు ప్రత్యేక బస్సులు, చిన్నబోయినపల్లి, కొండాయి మీదుగా మరో మూడు బస్సులను నడిపిస్తున్నామన్నారు. మినీ జాతరకు వచ్చే భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రయాణీకుల అవసరాన్ని బట్టి మరిన్ని బస్సులను పెంచుతామని విజయ భాను తెలిపారు.

## సమగ్ర సమాచారంతో డిపిఆర్ రూపొందించాలి

■ బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే



**వరంగల్,మహా:** సమగ్రసమాచారంతోడిపిఆర్ రూపొందించాలని సంబంధిత అధికారులతో బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. మంగళవారం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో యు జీ డి (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) డిపిఆర్ రూపకల్పనపై కన్సల్టెంట్ ప్రతినిధులు, బల్దియా ఇంజనీరింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో కమిషనర్ సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బల్దియా పరిధి లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పరిధి లోకి వచ్చే అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని డి పి ఆర్ తయారు చేయాలని 66 డివిజన్ లలో గల ఎస్ టి పి లను క్షేత్ర స్థాయి లో పరిశీలించి వాటి సమాచారం పొందుపరచి త్వరితగతిన డి పి ఆర్ తయారు చేసి అందజేయాలని కన్సల్టెంట్ ప్రతినిధులకు కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో బల్దియా ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర ఇన్చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఈ ఈ లు రవికుమార్, శ్రీనివాస్, సంతోష్ బాబు, మహేందర్, కన్సల్టెంట్ ప్రతినిధి మనోజ్ అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.



## ఓరొ ఏక్ బార్ గంట..జీ

శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న జిల్లా అధ్యక్షులు

**వరంగల్, మహా:** వరంగల్ జిల్లా ప్రజల ఆశీస్సులు.. బిజెపి నాయకులు, కార్యకర్తల ఆదరాభిమానాలతో భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులుగా రెండవసారి నియమింపబడిన సందర్భంగా మంగళవారం జిల్లా బిజెపి నాయకులు, అభిమానులతో కలిసి ఓరుగల్లు ఇలవేల్పు శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, ఓరుగల్లు ప్రజలకి అమ్మవారి ఆశీస్సులతో, అనుగ్రహాలతో సుఖ సంతోషాలు కలగాలని కోరుకున్న బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్. అనంతరం వారు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలలో వరంగల్ జిల్లాలో కాషాయ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా, జిల్లా సీనియర్ నాయకులతో, పాత కొత్త నాయకులతో కలిసికట్టుగా సమన్వయంతో పనిచేసి, జిల్లాలో బిజెపి పార్టీని మరింత పటిష్టంగా బలపరుస్తానని తెలిపారు.

## కేంద్ర బడ్జెట్లో తెలంగాణ ఊసే లేకుండా ప్రవేశపెట్టారు

■ జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొంత మాదవ రెడ్డి
■ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా అదమర్చారు



**ఇబ్రహీంపట్నం, మహా:** కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగానికి, శ్రామిక వర్గానికి పూర్తిగా వ్యతిరేకంగా ఉందని, కార్పొరేటర్లకు అనుకూలంగా ఉందని తెలంగాణ రాష్ట్ర రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు (సిపిఐ పార్టీ అనుబంధ సంఘం)అధ్యక్షులు కొంత మాధవ రెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని డాక్ బంగ్లాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాధవరెడ్డి మాట్లాడుతూ... వ్యవసాయ రంగం సబ్సిడీలకు కోతపెట్టారని, ఎరువుల రాయితీల్లో 11 వేల కోట్ల కోత పెట్టారన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో తెలంగాణ ఊసే లేకుండా బడ్జెట్ ఏర్పాటు చేయడం రాష్ట్రానికే అవమానంగా ఉందని అన్నారు. రాష్ట్రం నుండి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టలేకపోయారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 50,65 345 కోట్లుగా ఉన్నప్పటికీ వ్యవసాయ రంగానికి ఆశించినంత స్థాయిలో కేటాయింపులు జరగలేదని, 1,71,437 కోట్లు వ్యవసాయానికి ఇచ్చినట్టే ఇచ్చి ఇందులో నుండి మత్స్య శాఖకు కూడా కలిపింది, అంటే వాస్తవానికి కేవలం 1,27,290 కోట్లు మాత్రమే. మొత్తం బడ్జెట్లో కేంద్రం కేవలం 2.51 శాతం మాత్రమే కేటాయింపులు చేసింది. ఎరువులు సబ్సిడీలు కూడా 3,412 వేల కోట్లకు తగ్గించింది .ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ పై పున సమీక్షించాలని మాధవరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చల్ల నారాయణరెడ్డి, గంధం బాలరాజ్, ఎస్ బాల్ రెడ్డి, కేరజనీకాంత్, సి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందించాలి

డీఎంహెచ్వో డాక్టర్ గోపాల్ రావు



**ములుగు, మహా :** జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విస్తృత ప్రచారం చేసి ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందించేలా కృషి చేయాలని జిల్లా వైద ఆరోగ్య శాఖ అదికారి డాక్టర్ ఎన్.గోపాల్ రావు సూచించారు. ఆశా డే సందర్భంగా ములుగు జిల్లా కార్యాలయంలో రాయినిగూడెం పీహెచ్సీ పరిధిలోని ఆశా, ఆరోగ్య కార్యకరతలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలు ఇంటింటి సందర్శన చేస్తూ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలలో ఉన్న ఆందోళనలు, అనుమానాలు నివృత్తి చేయాలన్నారు. ప్రభుత్వ వైద్య సేవలను ఉపయోగించుకునేటట్లు కృషి చేయాలని ఆశా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. జాతీయ మాతా శిశు సంరక్షణ, పోషకాహార కార్యక్రమంలో గర్భిణీ స్త్రీల నమోదు 12వారాల లోపు చేయించి నాలుగు వైద్య పరీక్షలను చేయించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలు అయ్యేటట్లు పని చేయాలన్నారు. ఈనెల చివరి వరకు అసంక్రమిక వ్యాధుల స్క్రీనింగ్ పరీక్షలను 100శాతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసంక్రమిక వ్యాధుల నియంత్రణాధికారి డాక్టర్ పవన్ కుమార్, రాయిని గూడెం పీహెచ్సీ అధికారి డాక్టర్ ప్రసాద్, డాక్టర్ నాగ అన్వేష్, డెమో సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పూర్ణ, సంపత్ రావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేసవిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిరంతరాయ విద్యుత్ సరఫరా

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, మహా:** రానున్న వేసవి కాలంలో ప్రభుత్వ ఆసుపత్రులలో నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఎన్పీడీసీఎల్, ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్ లతో ప్రభుత్వ ఆసుపత్రులలో నిరంతర విద్యుత్ సరఫరాకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ అత్యవసర ఆసుపత్రులలో నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకోవాలని, అందులో భాగంగా మహాత్మా గాంధీ ఆసుపత్రిలోని జనరేటర్ లను ఎప్పటికప్పుడు ఆటోమోడ్ లో ఉంచుతూ సక్రమంగా పనిచేసే విధంగా పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ సికేఎం ప్రసూతి ఆసుపత్రి , ప్రాంతీయ కంటి ఆసుపత్రుల జనరేటర్లను మ్యానువల్ నుండి ఆటో మోడ్ లో ఉండేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనికితోడుగా ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో, జనరేటర్ ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో ఎన్పీడీసీఎల్ ఎస్సీ మధుసూదన్ రావు, జిల్లా వైద్యఆరోగ్య అధికారి డాక్టర్ సాంబశివరావు, పర్యవేక్షకులు కిషోర్, పద్మావతి, ఆర్ ఎం ఓలు మురళి, వంశీ ప్రియ, సత్యజిత్ రే, తదితరులు పాల్గొన్నారు.

## గుంతల రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు



**ఇబ్రహీంపట్నం, మహా:** ఆక్టోపస్ లోని కమాండెంట్ సయ్యద్ జమిల్ భాషా, అధనపు కమాండెంట్ శ్రీనివాస్ రావు, మూడవ బెటాలియన్ కానిస్టేబుల్ తో కలిసి రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇబ్రహీంపట్నం నుండి నాగంపల్లి వెళ్లే రోడ్డు అద్వానంగా కావడంతో అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. తరచూ ప్రమాదాలకు గురి కావడంతో ఆక్టోపస్ లోని మూడవ బెటాలియన్ అధికారులు కానిస్టేబుల్ తో కలిసి అతుకులు గతుకులుగా ఉన్న రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి గుంతలను పూర్చడం జరిగింది. మూడవ బెటాలియన్ అధికారులు తీసుకున్న నిర్ణయానికి పలువురు వాహనదారులు హర్షించారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ యొక్క రోడ్డుపై దృష్టి పెట్టి రోడ్డు పనులను ప్రారంభించాలని ప్రజలు కోరారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



**నిజామాబాద్, మహా :** శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలను పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి వేర్వేరుగా ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ల సంఖ్య గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉన్న సదుపాయాలు కలెక్టర్ పరిశీలించారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ప్రతి పోలింగ్ స్టేషన్ లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, స్థానిక అధికారులు ఉన్నారు.

## అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్ పార్టీ

■ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి..ఈనెల 6 నుండి కార్యకర్తల సమావేశాలు
ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ను ఎండగడుతామని వెల్లడి



**ఇబ్రహీంపట్నం, మహా:** అందమైన అబద్ధాలు చెప్పి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ అబద్ధాలతోనే కాలం వెళ్లదీస్తున్నదని జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మండలాల బిఆర్ఎస్ పార్టీ కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత శాసనసభ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి మహిళలకు ఫ్రీ బస్సు మాత్రమే అమలు చేయగలిగిందని చెప్పారు. బస్సుల సంఖ్య తగ్గించడంతో, బస్సులల్లో సిగపట్లకు వేదికలుగా మారాయని, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని అన్నారు. రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్తు, 500 కే వంట గ్యాస్, రెండు లక్షల రుణమాఫీ సగం మందికి కూడా సక్రమంగా అందలేదని ఆయన దుయ్యబట్టారు. అరకొరగా అమలైన వీటిని సంపూర్ణంగా అమలు చేసినట్టు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ పాలనలో విడుదల చేసిన 7600 కోట్ల రైతుబంధు నిధులు గత పార్లమెంటు ఎన్నికల ముందు రైతుల ఖాతాల్లో వేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా రైతు భరోసా నిధులు ఇవ్వలేదని అన్నారు. రెండు సార్లు రైతు భరోసా నిధులు ఎగ్గొట్టి, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల కోసం పథకాల పేరిట నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. నాట్లప్పుడు ఇవ్వాల్సిన డబ్బులు ఓట్లప్పుడు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీ మోసపు నైజానికి నిదర్శనమన్నారు.రెండు లక్షల ఉద్యోగాలు, నాలుగు వేల నిరుద్యోగ భృతి, ఐదు లక్షల విద్యా భరోసా కార్డు, విద్యార్థినులకు స్కూటీలు, మహిళలకు నెలకు 2500, వృద్ధులకు 4000 పింఛన్లు, వికలాంగులకు 6000 పింఛను, కళ్యాణలక్ష్మి తులం బంగారం, 12 లక్షల దళితబంధు తదితర 420 హామీలు అమలు కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కిందని ఆయన విమర్శించారు. మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకట రమణా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బుగ్గరాములు, చీరాల రమేష్, కొత్త కిషన్ గౌడ్, కార్యదర్శులు బహదూర్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, మాజీ ఎంపిపి కృపేష్ తదితరులు పాల్గొన్నారు.




## దేశ ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

■ బిజెపి క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్
■ మధ్యతరగతి కుటుంబాలకు బాసటగా నిలిచిన బడ్జెట్

**ఇబ్రహీంపట్నం, మహా:** భారతీయ జనతా పార్టీ పిలుపుమేరకు మంగళవారం తుర్కయంజాల్ బిజెపి అధ్యక్షులు ఎలిమినేటి నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి క్రమశిక్షణ సంఘం కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ సమక్షంలో, దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ... ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో 12 లక్షల వరకు పన్ను మినహాయింపు కల్పించడం వలన మధ్యతరగతి కుటుంబాలకి ఎంతగానో లాభం చేకూర్చుతుందని హర్షం వ్యక్తం చేస్తూ మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగిందన్నారు. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డ్ లిమిట్ 3లక్షల నుంచి 5లక్షలు పెంచుతూ ఏ పూచికత్తూ లేకుండా ఐదు లక్షలు వరకు రుణం ఇవ్వడం అనేది హర్షనీయమైన విషయం అని తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ అధ్యక్షుడు తూళ్ల నరసింహ గౌడ్, బచిగాళ్ల రమేష్, కొత్త రామ్ రెడ్డి, అర్జున్ గౌడ్, పలుసా శ్రవణ్, బాలకృష్ణ గౌడ్, బిక్షపతి, కొంతం బల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, విశాల్, సూరి, కొమ్మం శివ తదితరులు పాల్గొన్నారు.



## మనిషిలా తెలివి మీరుతున్న ఏఐ

కృత్రిమ మేధస్సు (AI) వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ పురోగతికి 'మెమోరీని ఏకీకృతం' చేయడం కీలకంగా మారుతోంది. ఏఐ వ్యవస్థను నడిపించే ముఖ్య కారకాల్లో ఇది ప్రధానమైంది. సమస్యలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడానికి, వాటిని పరిష్కరించడానికి మానవులు జ్ఞాపకశక్తిపై ఆధారపడినట్లే.. ఏఐ వ్యవస్థలు వాటి సామర్థ్యాలను మెరుగుపరచడానికి మెమరీని ఉపయోగించడం ఇప్పటికే ప్రారంభించాయి. ఈ మార్పు మరింత అధునాతనంగా, మానవ తరహా కృత్రిమ మేధకు మార్గం సుగమం చేస్తోంది. ఓహియో స్టేట్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న యూసు ఈ రంగంలో పరిశోధనలు చేస్తున్నవారిలో ప్రముఖంగా ఉన్నారు. ఓహియో స్టేట్ యూనివర్సిటీలో చేరడానికి ముందు తాను మైక్రోసాఫ్ట్ సెమాంటిక్ మెషీన్స్‌లో సీనియర్ పరిశోధకుడిగా పనిచేశారు. అక్కడ తాను సంభాషణాత్మక ఏఐపై విధులు నిర్వహించారు. నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెమరీ ఆగ్మెంటెడ్ ఏఐ సిస్టమ్స్ అభివృద్ధిలో పరిశోదనలు చేశారు.

### సందర్భానుసారం స్పందించే ఏఐ

అత్యాధునిక సమాచారంతో నిర్ణయాలు తీసుకోవడం కోసం గత సమాచారాన్ని గుర్తుంచుకుని, సందర్భానుసారం దాన్ని ఉపయోగించే ఏఐ వ్యవస్థలను సృష్టించడంపై దృష్టి సారించినట్లు యూసు తెలిపారు. భాషా అవగాహన, రీజనింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ వంటి పనులకు ఈ విధానం కీలకమని చెప్పారు. కృత్రిమ మేధస్సులో మెమోరీని చేర్చడం ద్వారా సాంకేతిక పరిశోధకులు.. గత అనుభవాల నుంచి నేర్చుకోగల, కొత్త పరిస్థితులకు అనుగుణంగా మరింత కచ్చితమైన ప్రతిస్పందనలను అందించే ఏఐ వ్యవస్థలను సృష్టించడంలో నిమగ్నమయ్యారు.

### మెమోరీతో ఉపయోగాలు..

ఏఐ వ్యవస్థలో మెమోరీ ఆగ్మెంటెడ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం అధికంగా ఉంటుంది. ఆరోగ్య సంరక్షణలో, రోగి చరిత్రలు, చికిత్స ఫలితాలను గుర్తు చేసుకోవడం ద్వారా వ్యాధులను నిర్ధారించడంలో ఇది సహాయపడుతుంది. ఫైనాన్స్ విభాగంలో గత డేటాను విశ్లేషించడం ద్వారా మార్కెట్ ధోరణులను అంచనా వేయడంలో తోడ్పడుతుంది. రోజువారీ పనులను మరింత మెరుగ్గా చేసేందుకు ఉపయోగపడుతుంది. మరింత సహజంగా వినియోగదారు అవసరాలకు ప్రతిస్పందించేలా చేస్తుంది.

### సమర్థమైన వ్యవస్థలు..

కృత్రిమ మేధ అభివృద్ధి చెందుతున్న కొద్దీ సాంకేతిక పరిశోధకుల సహకారం మెరుగైన భవిష్యత్తును రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. జ్ఞాపకశక్తి శక్తిని ఉపయోగించుకోవడం ద్వారా ఏఐ వ్యవస్థలు మరింత తెలివైనవిగా, సమర్థవంతమైనవిగా మారుతున్నాయి.



## 2025లో బెస్ట్ స్మార్ట్‌ఫోన్స్

### రూ.10 వేల కంటే తక్కువే..

ఇండియన్ మార్కెట్లో ప్రతి నెలా కొత్త స్మార్ట్‌ఫోన్లు లాంచ్ అవుతూనే ఉన్నాయి. అయితే ఇందులో ఎక్కువ రేటున్న మొబైల్స్ ఉన్నాయి. తక్కువ ధరకు లభించే మొబైల్ ఫోన్స్ కూడా ఉన్నాయి. ఈ కథనంలో రూ. 10వేలు ధర వద్ద అందుబాటులో ఉన్న బెస్ట్ మొబైల్స్ గురించి చూసేద్దాం.

**మోటో జీ45 5జీ (Moto G45 5G)**

మార్కెట్లో సరసమైన మొబైల్ ఫోన్ల జాబితాలో మోటో కంపెనీకిని చెందిన 'జీ45 5జీ' ఒకటి. దీని ప్రారంభ ధర రూ. 10,000. ఇది 4 జీబీ. 8 జీబీ ర్యామ్ ఆప్షన్స్ పొందుతుంది. కాబట్టి ఎందుకుని వేరియంట్‌ను బట్టి ధరలు మారుతాయి. ఈ స్మార్ట్‌ఫోన్ 6.45 ఇంచెస్ హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లే పొందుతుంది. ఇది క్వాల్‌కమ్ స్నాప్‌డ్రాగన్ 6ఎస్ జెన్ 3 చిప్ ద్వారా శక్తిని పొందుతుంది. ఇందులోని 5000 mAh బ్యాటరీ 18W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది.

**ఇన్ఫినిక్స్ హాట్ 50 5జీ (Infinix Hot 50 5G)**

ఇన్ఫినిక్స్ హాట్ 50 5జీ అనేది 1600 x 720 పిక్సెల్స్ రిజల్యూషన్, 120Hz రిఫ్రెష్ రేట్‌తో 6.7 ఇంచెస్ హెచ్‌డీ ఎల్సీడీ డిస్‌ప్లే పొందుతుంది. ఇది మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ప్రాసెసర్ పొందుతుంది. ఇది 4జీబీ, 8జీబీ ర్యామ్ ఆప్షన్లలో అందుబాటులో ఉంది. ఈ మొబైల్ 5,000 mAh బ్యాటరీ కలిగి 18 W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. సెల్ఫీలు తీసుకోవడానికి, వీడియో కాల్స్ చేయడానికి 8MP అల్ట్రావైడ్ యాంగిల్ లెన్స్ కూడా పొందుతుంది. దీని ప్రారంభ ధర రూ.9,499.

## రతన్ టాటా ఫ్రెండ్.. శంతనుకు

### టాటా మోటార్స్‌లో కీలక బాధ్యతలు



దివంగత వ్యాపార దిగ్గజం 'రతన్ టాటా' మిత్రుడిగా గుర్తింపు తెచ్చుకున్న 'శంతను నాయుడు'కు టాటా మోటార్స్‌లో కీలక బాధ్యతలు అప్పగించారు. ఈయన కంపెనీలో జనరల్ మేనేజర్ & స్ట్రాటజిక్ ఇనిషియేటివ్స్ హెడ్‌గా నియమితులయ్యారు. ఈ విషయాన్ని తానె స్వయంగా తన లింక్డ్ఇన్‌లో వెల్లడించారు. ''టాటా మోటార్స్‌లో స్ట్రాటజిక్ ఇనిషియేటివ్స్ హెడ్ & జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్నందుకు నాకు సంతోషంగా ఉంది. నా తండ్రి తన తెల్లటి చొక్కా, నేవీ ప్యాంటుతో టాటా మోటార్స్ ప్లాంట్ నుంచి ఇంటికి నడిచి వచ్చేవారు. ఆయన కోసం నేను కిటికీలో చూస్తూ ఉండేవాడిని. ఆ సంఘటన నాకు ఇంకా గుర్తుంది'' అని శంతను నాయుడు తన లింక్డ్ఇన్‌లో రాశారు.

**ఎవరీ శంతను నాయుడు?**


శంతను నాయుడు ఒక ఆటోమొబైల్ డిజైన్ ఇంజినీర్. ఇతడు ఒక రోజు రోడ్డు మధ్యలో వీధి కుక్క చనిపోయి ఉండటాన్ని గమనించిన చలించిపోయాడు. ఆ తరువాత వీధి కుక్కల సంరక్షణకు ఏదో ఒకటి చేయాలని ఆలోచనలో పడ్డాడు. తన స్నేహితులతో కలిసి వీధి కుక్కల కోసం రేడియం స్టిక్కర్లతో తయారు చేసిన కాలర్స్‌ని తయారు చేశాడు. తన ఇంటి పరిసరాల్లోని కుక్కలకు వాటిని అమర్చాడు. ఆ పనికి మరుసటి రోజే స్థానికుల నుంచి మెప్పు పొందాడు. ముంబైలో ఉన్న వీధి కుక్కలన్నింటికీ ఈ రేడియం కాలర్ అమర్చాలని నిర్ణయించారు. కానీ అది డబ్బుతో కూడకున్న వ్యవహారం కావడంతో విషయాన్ని తన తండ్రికి చెప్పాడు. ఆయన 'వీధి కుక్కలను కాపాడేందుకు సాయం చేయాల్సిందిగా రతన్ టాటాని అడుగు. ఆయనకు కుక్కలంటే ఇష్టం' అని సలహా ఇచ్చాడు.

**మోటోపాస్ పేరుతో స్టార్టప్**

వీధి కుక్కలను రోడ్డు ప్రమాదాల నుంచి కాపాడేందుకు 'మోటోపాస్' పేరుతో స్టార్టప్ ఏర్పాటు చేశానని, దానికి సాయం చేయాల్సిందిగా కోరుతూ పూర్తి వివరాలు కలిగిన ఈ మెయిల్‌ను ఏకంగా రతన్‌టాటాకే పంపాడు. రోజులు గడుస్తున్నా ఎలాంటి రిప్లై లేకపోవడంతో తన పనిలో తాను నిమగ్నమయ్యాడు.

### గుడ్‌ఫెలోస్

సాటి జీవుల పట్ల శంతను నాయుడికి ఉన్న ప్రేమ రతన్‌టాటాను ఆకట్టుకున్నాయి. శంతన్ నాయుడి ఆలోచణ సరళి టాటాను ఆకర్షించింది. మోటోపాస్‌తోపాటు శంతన్ సెప్టెంబర్ 2022లో 'గుడ్‌ఫెలోస్'ను స్థాపించారు. ఇది యువకులను మమేకం చేసి సీనియర్ సిటిజన్‌ల ఒంటరితనం పోగొట్టేందుకు పనిచేస్తోంది. అతను 'ఐ కేమ్ అపాన్ ఎ లైట్‌హౌస్' పేరుతో రతన్ టాటాతో ఉన్న జ్ఞాపకాలు, తన నుంచి నేర్చుకున్న విషయాలపై పుస్తకం రాశారు.





# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL



## అందుకే..భారీగా పన్ను మినహాయింపు: నిర్మలాసీతారామన్



**న్యూఢిల్లీ:** దేశ ప్రజలకు రూ.12 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం వెనుక అసలు కారణాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ వెల్లడించారు. మంళవారం (ఫిబ్రవరి 4) ఓ టీవీ ఛానల్‌తో ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయంపై మాట్లాడారు. 'గత మూడు నాలుగేళ్ల నుంచి మేం ట్యాక్స్ పేయర్స్‌తో మాట్లాడుతున్నాం. పన్ను చెల్లించే విషయంలో వారు ప్రభుత్వాన్ని పూర్తిగా నమ్ముతున్నారు. వారంతా క్రమం తప్పకుండా పన్ను కడుతూ దేశానికి చేస్తున్న సేవను గౌరవించేందుకే ప్రధాని మోదీ పన్ను మినహాయింపు ఇచ్చారు. పాత పన్ను విధానంలో మినహాయింపులు కావాల్సిన వాళ్ల కోసం దానిని కూడా అందుబాటులోనే ఉంచాం. కొత్త ఆదాయపన్ను చట్టం మొత్తం పన్ను ప్రక్రియను సులభతరం చేస్తుంది. 1961 పన్ను చట్టం చాలా క్లిష్టతరంగా ఉండడంతో పన్ను చెల్లింపుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు' అని నిర్మల తెలిపారు. కాగా, ఇటీవలి బడ్జెట్‌లో రూ.12 లక్షల దాకా ఆదాయం ఉన్న వేతన జీవులకు పూర్తిగా పన్ను మినహాయిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మినహాయింపుతో పాటు రూ.75వేల స్టాండర్డ్ డిడక్షన్ వెసులుబాటు కూడా లభించనుంది. కొత్త పన్ను విధానంలో ఆదాయ పన్ను శ్లాబులను కూడా తగ్గించారు.



## ఢిల్లీ ఎన్నికల్లో గెలుపుపై కేజ్రీవాల్ ధీమా..!



**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీకి రేపు (బుధవారం) జరుగనున్న ఎన్నికల్లో తాము కచ్చితంగా గెలుస్తామనే ధీమా వ్యక్తం చేశారు ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్. ఢిల్లీ అసెంబ్లీకి సంబంధించి 70 సీట్లకు గాను 55 సీట్లను తాము గెలుచుకుంటామన్నారు. ఒకవేళ బీజేపీ గనుక ఢిల్లీ ఎన్నికల్లో గెలిస్తే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలకు ముగింపు పలకడం ఖాయమన్నారు కేజ్రీవాల్. ఈ మేరకు తన సోషల్ మీడియా హ్యాండిల్ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు కేజ్రీవాల్. ' నా అంచనా ప్రకారం మేము 55 సీట్లను గెలవడం ఖాయం. ఒకవేళ మహిళల ఇంకాస్త ముందుకొచ్చి పురుషుల చేత ఓట్లను మాకు పడేలా చేస్తే మాత్రం తిరుగులేని మెజార్టీతో అధికారంలోకి వస్తాం. ఇలా జరిగితే 60 సీట్లకు పైగానే గెలుచుకుంటాం. మీరు (ప్రజలు) కనుక కమలం గుర్తుకు ఓటేస్తే మాత్రం మీరు ఇంటికి వెళ్లేసరికే కరెంట్ పోవడం ఖాయం. దేశంలో అత్యంత చౌకగా కరెంట్‌ను అందిస్తున్నది జాతీయ రాజధాని ఢిల్లీలోనే. ఇక్కడ 200 యూనిట్ల వరకూ ఉచిత కరెంటును ఇవ్వడంతో పాటు 400 యూనిట్లకు రూ. 800 మాత్రమే వసూలు చేస్తున్నాం. అదే సమయంలో 24 గంటల విద్యుత్‌ను కూడా అందిస్తున్నాం. అందుచేత మీరు చీపురు గుర్తు ఉన్న బటన్‌ను ప్రెస్ చేయండి' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. 2015లో ఢిల్లీ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో 67 సీట్లను ఆప్ గెలిస్తే. 2020లో 62 సీట్లలో విజయం సాధించింది. మీరు ఎందుకు ఆప్‌కు ఓటేయాలంటే.. ◌మేము గత 10 ఏళ్లలో ఎంతో బాధ్యతగా పరిపాలన అందించాం. ఢిల్లీలో చాలా పనులు చేశాం. ఇక బీజేపీ అధికారంలో ఉన్న 20 రాష్ట్రాల్లో 24 గంటల విద్యుత్ అనేదే లేదు' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీపై ప్రివిలేజ్‌మోషన్..

### స్పీకర్‌కు బీజేపీ ఎంపీ లేఖ



**న్యూఢిల్లీ:** ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీపై బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే లోక్‌సభలో సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు.వాస్తవాలను వక్రీకరించిన భారత్ పరువు పోయేలా మాట్లాడినందుకుగాను రాహుల్‌గాంధీపై సభాహక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రక్రియ ప్రారంభించాలని స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు దూబే స్పీకర్‌కు ఒక లేఖ రాశారు. మేక్ ఇన్ ఇండియా ఫెయిలనందుకే చైనా భారత్‌ను ఆక్రమించిందని రాహుల్ అవాస్తవాలు మాట్లాడారని స్పీకర్‌కు రాసిన లేఖలో దూబే పేర్కొన్నారు.పార్లమెంట్ వేదికగా దేశం పరువు తీసేలా రాహుల్ మాట్లాడరని ఆరోపించారు. రాహుల్ తన వ్యాఖ్యలకు ఆధారాలు చూపించలేదని, కనీసం క్షమాపణలు కూడా చెప్పలేదని దూబే గుర్తు చేశారు. కాగా, లోక్‌సభలో సోమవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై రాహుల్‌గాంధీ మాట్లాడారు. చైనా భారత్‌లో కొంత భాగాన్ని ఆక్రమించిందన్నారు. ఇంతేగాక విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ అమెరికా పర్యటనపైనా రాహుల్ విమర్శలు చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తీరుపైనా రాహుల్ మాట్లాడారు. రాహుల్ ప్రసంగంలోని ఈ అంశాలన్నీ వివాదాస్పదమయ్యాయి.

## తొక్కిసలాట పెద్ద విషయమేమీ కాదు: హేమామాలిని



**న్యూఢిల్లీ:** సీనియర్ నటి, బీజేపీ ఎంపీ హేమామాలిని మహా కుంభమేళా దుర్ఘటనపై చేసిన వ్యాఖ్యలు.. వివాదాస్పదంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. తొక్కిసలాటలో అంత మంది చనిపోవడం పెద్ద విషయమేమీ కాదని అన్నారామె. మహా కుంభమేళాలో ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమం తొక్కిసలాటలో 30 మంది మరణించగా.. 60 మంది గాయపడ్డారని యూపీ ప్రభుత్వం ప్రకటించింది. అయితే.. మరణాల సంఖ్యను యూపీ సర్కార్ దాస్తోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలో.. ఈ అంశం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలనూ కుదిపేస్తోంది. అయితే ఈ విమర్శలపై హేమా మాలిని స్పందించారు. ''మేమూ పుణ్య స్నానం కోసం అక్కడికి వెళ్లాం. జరిగిందేదో జరిగింది. అయినా అదేం అంత పెద్ద ఘటనేం కాదు. కేవలం ప్రతిపక్షాలు ప్రదర్శిస్తున్న అతిశయోక్తి మాత్రమే. కుంభ మేళా నిర్వహణలో యోగి ప్రభుత్వం అద్భుతంగా పని చేస్తోంది. అంతా సజావుగానే జరుగుతోంది. అయితే అంత మంది వస్తుండడంతో.. నిర్వాహణ కాస్త కష్టతరమే. కాబట్టి తొక్కిసలాట పెద్దగా పట్టించుకోవాల్సిన విషయం కాదు అని అన్నారామె.

## ఆకాశ్ బొబ్బ.. వీడు మాములోడు కాదు!

**మహా:** ఆకాశ్ బొబ్బ.. ఎవరీ కుర్రాడు? ఇప్పుడు ఇంటర్నెట్ అంతా అతని గురించే వెతికే పనిలో ఉంది. ఇలాన్ మస్క్ నేతృత్వంలో నడవబోయే యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్) విభాగంలో ఈ భారత సంతతికి చెందిన కుర్రాడికి చోటు దక్కింది. అందుకే అతని గురించి ఆరా తీసే ప్రయత్నాల్లో ఉన్నారు. అకాశ్ బొబ్బ (Akash Bobba).. 22 ఏళ్ల యువ ఇంజినీర్. డోజ్ నిర్వహణ కోసం మస్క్ ఆరుగురు యువ ఇంజినీర్లను ఎంచుకోగా.. అందులో ఆకాశ్ ఒకడు. అయితే డోజ్‌కు ఇతన్ని మస్క్ ఎంచుకున్నాడని తెలియగానే.. లింక్డిన్ సహా ఎక్కడా అతని గురించి సమాచారం లేకుండా చేశారు. కానీ, ఈలోపే సిలికాన్ వ్యాలీలోని ప్రముఖ కంపెనీలతో అతని ప్రయాణం గురించి బయటకు వచ్చేసింది. కాలిఫోర్నియా బర్కిలీ యూనివర్సిటీ నుంచి మేనేజ్‌మెంట్, ఎంట్రాప్రెన్యూర్‌షిప్, టెక్నాలజీ కార్యక్రమంలో గ్రాడ్యుయేషన్ చేశాడు ఆకాశ్. ఆపై మెటాలో ఏఐ మీద, పలాన్‌టిర్‌లో డాటా అనలైటిక్స్ మీద, బ్రిడ్జ్‌వాటర్ అసోషియేట్స్‌లో ఫైనాన్షియల్ మోడలింగ్ మీద ఇంటర్న్ చేశాడు. అయితే అతని పేరు ఇప్పుడు ప్రపంచమంతా మారుమోగుతున్నా.. ఆ మాజీ క్లాస్‌మేట్ ఒకరు పంచుకున్న విషయం ఇప్పుడు నెట్‌లో వైరల్ అవుతోంది.

కాలేజీ రోజుల్లో బృందంలోని సభ్యుడి తప్పిదంతో ప్రాజెక్టు మొత్తం డిలీట్ అయ్యిందట. సమయం పెద్దగా లేకపోవడంతో బృందం మొత్తం కంగారుపడుతోందంట. ఆ టైంలో.. ఆ రాత్రి రాత్రే సోర్స్ కోడ్‌ను ఉపయోగించకుండానే తిరిగి ఆ ప్రాజెక్టు మొత్తాన్ని.. అంతకు ముందు కంటే బెటర్‌గా రూపొందించాడు ఆకాశ్. ఆ టైంలో అతని కోడింగ్ సామర్థ్యం చర్చనీయాంశమైందని అతని స్నేహితుడు చెబుతున్నారు .

ప్రభుత్వ ఖర్చులున గణనీయంగా తగ్గించేందుకు ఇలాన్ మస్క్ (Elon Musk) సారథ్యంలో ఏర్పాటైందీ విభాగం. డోజ్‌లో కీలక బాధ్యతల కోసం ఆకాశ్‌తో ఆరుగురిని మస్క్ ఎంచుకున్నాడు. అయితే ఆకాశ్ తల్లిదండ్రులెవరు? భారతీయ మూలాలు ఎక్కడ ఉన్నాయి? అనే విషయాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. వాళ్లంతా 1924 ఏళ్లలోపు కుర్రాళ్లే. అందులో ఓ విద్యార్థి సైతం ఉన్నాడు. అయితే ఈ నిర్ణయాన్ని పలువురు తీవ్రంగా తప్పుబడుతున్నారు. జాతీయ భద్రతకు సంబంధించిన అంశం.. అందునా కీలకమైన బాధ్యతలకు ఏమాత్రం అనుభవం లేనివాళ్లను ఎంపిక చేయడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అనుభవజ్ఞులు ఉండాలనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. యూఎస్ ఎయిడ్ నుంచి కీలక సమాచారాన్ని తీసుకునే ప్రయత్నం చేశారంటూ డోజ్ సిబ్బంది పైనా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక.. ఇలాన్ మస్క్ తీసుకున్న నిర్ణయాలు అంతిమం కాదని, వాటికి తమ అనుమతి తప్పనిసరి అని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం ఇప్పుడు అక్కడ చర్చనీయాంశమైంది.

# 4 నెలల్లో 3 హిట్లు కొట్టేంది..


## టాలీవుడ్‌లో లక్కీ హీరోయిన్‌గా మారింది

ఇండస్ట్రీలో చాలా మంది ఓవర్ నైట్ లో స్టార్స్ గా మారిపోయారు.కొంతమంది స్టార్ డమ్ కోసం ప్రయత్నిస్తున్నారు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో దూసుకుపోతున్నారు. కొంతమంది కొన్ని సినిమాలతోనే కనిపించకుండా పోయారు. ఇక మరికొంతమంది వరుస సినిమాలు చేస్తున్నారు. అయితే చాలా మంది భామలు వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ అదృష్టం కలిసి రాక హిట్స్ అందుకోలేకపోతున్నారు. మరికొంతమంది మాత్రం హిట్స్ తో దూసుకుపోతున్నారు. పై ఫొటోలో కనిపిస్తున్న బ్యూటీ 4 నెలల్లో 3 హిట్లు అందుకుంది. అంతే కాదు ఆ సినిమాలు 850 కోట్ల కలెక్షన్స్ రాబట్టాయి ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఇప్పుడు స్టార్ హీరోలు కూడా ఆమె డేట్స్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇంతకూ ఆ బ్యూటీ ఎవరో తెలుసా.? ఆమె ఎవరో కాదు ఇప్పుడు టాలీవుడ్ లో ఎక్కడ చూసినా ఆమె పేరే వినిపిస్తుంది. ఆ భామ ఎవరో కాదు లేటెస్ట్ సెన్సేషన్ మీనాక్షి చౌదరి. మీనాక్షి చౌదరి ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ.. బిజీగా మారింది. అక్కినేని హీరో సుశాంత్ హీరోగా నటించిన ఇచ్చట వాహనములు నిలుపరాదు సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది మీనాక్షి చౌదరి. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది. రవితేజ హీరోగా నటించిన ఖిలాడి సినిమాలో తన అందంతో ఆకట్టుకుంది. ఇక బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసింది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ సినిమాలు చేస్తుంది ఈ అమ్మడు. తమిళ్ లో రీసెంట్ గా విజయ్ గోట్ సినిమాలో నటించింది. తెలుగులో వరుస హిట్స్ అందుకుంది. 4 నెలల్లో 3 హిట్లు అందుకుంది ఈ చిన్నది. గత నాలుగు నెలల్లో మూడు హిట్స్ అందుకుంది ఈ చిన్నది. విజయ్ హీరోగా వెంకట్ ప్రభు దర్శకత్వం వహించిన ఈసినిమా 450 కోట్లకు వసూల్ చేసింది. ఈ సినిమాలో మీనాక్షి హీరోయిన్ గా చేసింది. మీనాక్షి హిట్ లిస్ట్‌లో చేరిన చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది.బాక్సాఫీస్ దగ్గర రూ.100 కోట్ల వరకు రాబట్టింది.



# అబ్బాయిలా మారిపోయిన సమంత


ఏమాయ చేశావే సినిమాతో కుర్రకారు మనసు దోచేసుకున్న ముద్దుగుమ్మ సమంత. ఈ అమ్మడు మొదటి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకొని, వరస సినిమాలతో టాలీవుడ్‌నే షేక్ చేసిందని చెప్పవచ్చు. వరసగా స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంటూ, టాలీవుడ్ నెంబర్ వన్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. కెరీర్ మంచి ఫామ్‌లో ఉన్న సమయంలోనే సమంత ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అనారోగ్య సమస్యలతో ఈ బ్యూటీ చాలా రోజుల పాటు సినిమాలకు బ్రేక్ ఇచ్చి, రెస్ట్ తీసుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడిప్పుడే ఈ ముద్దుగుమ్మ తన హెల్త్ ప్రాబ్లమ్స్ నుంచి బయటపడి, మళ్లీ సినిమాలపై ఫోకస్ చేసింది. మా ఇంటి బంగారం లాంటి ప్రాజెక్ట్స్‌లో బిజీగా ఉంది. ఇక ఈ మధ్య సమంత నా అభిమానుల కోసం నేను సినిమాలు చేస్తాను. కానీ ఛాలెజింగ్‌గా ఉన్న పాత్రలనే ఎంచుకుంటాను అని తెలిపిన విషయం తెలిసిందే. అయితే తాజాగా సామ్ స్టన్నింగ్ లుక్‌లో దర్శనం ఇచ్చింది. ఈ బ్యూటీ తన ఇన్‌స్టాలో షేర్ చేసిన ఫొటోల్లో అచ్చం అబ్బాయిలా కనిపిస్తుంది. ఇందులో సమంత చాలా అందంగా ఉంది. దీంతో ఈ ఫొటోలపై పలువురు పలు విధాలుగా కామెంట్స్ చేస్తున్నారు. కొందరు సూపర్ అంటే మరికొందరు ఈ బ్యూటీ హాలీవుడ్ చెక్కేస్తుంది అందుకే ఇలా రెడీ అయ్యిందని అంటున్నారు.



# హిట్ కొట్టాల్సిన పరిస్థితుల్లో మళ్లీ అదే తప్పు చేస్తున్న పూజ, శ్రీలీల

ఒకప్పుడు వెండితెర మీద సెన్సేషన్ క్రియేట్ చేసిన ఇద్దరు అందాలు భామలు ఇప్పుడు టఫ్ టైమ్‌ను ఫేస్ చేస్తున్నారు. గతంలో చేసిన సినిమాలతో వచ్చిన క్రేజ్ ఇన్నాళ్లు కెరీర్‌కు ఉపయోగపడింది. కానీ ఇక మీద అవకాశాలు రావాలంటే మాత్రం అప్ కమింగ్ సినిమాలతో కంపల్సరీగా హిట్ కొట్టాల్సిన పరిస్థితుల్లో ఉన్నారు ఈ బ్యూటీస్. రాఘవేంద్ర రావు పర్యవేక్షణలో పెళ్లి సందడి సినిమాతో వెండితెరకు పరిచయం అయిన బ్యూటీ శ్రీలీల. తొలి మూవీతోనే అందం అభినయంతో పాటు బెస్ట్ డ్యాన్సర్‌గా కూడా పేరు తెచ్చుకున్నారు ఈ బ్యూటీ. ఆ తరువాత ధమాకా, భగవంత్ కేసరి లాంటి హిట్స్ వచ్చినా... స్కంద, ఆదికేశవ లాంటి మూవీస్ అమ్మడి కెరీర్‌ను కష్టాల్లో పడేశాయి. ఒకేసారి నాలుగైదు సినిమాలకు కమిట్ అవ్వటంతో అన్ని సినిమాలకు సరిగా డేట్స్ అడ్జస్ట్ చేయలేక ఇబ్బంది పడ్డారు శ్రీలీల. ఈ విషయంలో కొన్ని విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. అదే సమయంలో వరుస ఫ్లాప్‌లతో కెరీర్ గాడి తప్పింది. ఇప్పుడు మళ్లీ అవకాశాలు వస్తున్నా.. అమ్మడి తీరు మాత్రం మారటం లేదు. మరోసారి ఎడా పెడా సినిమాలకు ఓకే చెప్పేసి డేట్స్ విషయంలో ఇబ్బంది పడుతున్నారు ఈ క్యూట్ బ్యూటీ. ఆ మధ్య వరుస సినిమాలతో పాన్ ఇండియా రేసులో ఫ్లాష్ అయిన పూజ హెగ్డే తరువాత సడన్‌గా స్లో అయ్యారు. రాధేశ్యామ్ లాంటి సినిమాలు తన కెరీర్‌ను మలుపు తిప్పుతాయన్న ఆశలతో వచ్చిన అవకాశాలు వదులుకొని ఇబ్బందుల్లో పడ్డారు. ఆ టైమ్‌లోనే కాలు ఫ్యాక్చర్ కావటంతో పూజ కెరీర్‌లో గ్యాప్ వచ్చింది. ఇప్పుడు మళ్లీ వరుస సినిమాలతో బిజీ అవుతున్న పూజా హెగ్డే, మరోసారి పాత తప్పునే రిపీట్ చేస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. రిలీజ్‌కు రెడీ అవుతున్న సినిమాల రిజల్ట్ చూశాకే కొత్త సినిమాలకు సైన్ చేయాలనుకుంటున్నారు పూజా. అందుకే తనని వెతుక్కుంటూ వస్తున్న ప్రాజెక్ట్స్ ను కూడా వదులుకుంటున్నారు. దీంతో మరోసారి పూజ కెరీర్ గాడి తప్పుతోందా అని టెన్షన్ పడుతున్నారు ఫ్యాన్స్.





# రామ్‌చరణ్ సినిమా కోసం పాత టెక్నాలజీ

ఎక్కడైనా టెక్నాలజీతో ఓ అడుగు ముందుకేసి తమ సినిమాలు తెరకెక్కించాలనుకుంటారు దర్శకులు. కానీ ఇక్కడ మాత్రం సీన్ రివర్స్‌లో జరుగుతుంది. రామ్ చరణ్ సినిమా కోసం 20 ఏళ్ళు వెనక్కి వెళ్తున్నారు బుచ్చిబాబు. మేకింగ్‌లో ఒకప్పటి టెక్నాలజీని మళ్లీ కెమెరా ముందుకు తీసుకొస్తున్నారు. మరి ఆయనలా ఎందుకు చేస్తున్నారు..? కారణమేంటి..? గేమ్ ఛేంజర్‌కు ఫలితంతో పని లేకుండా నటుడిగా మరో మెట్టు ఎక్కారు రామ్ చరణ్. ముఖ్యంగా అప్పన్న పాత్రకు అదిరి పోయే రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం చరణ్ ఫోకస్ అంతా బుచ్చిబాబు సినిమాపైనే ఉంది. ఈ చిత్ర షూటింగ్ నాన్‌స్టాప్‌గా నడుస్తుంది. దీనికోసం కొత్తగా పాతకాలం టెక్నాలజీని వాడుకోబోతున్నారు బుచ్చిబాబు. ఇదే ట్రెండింగ్ న్యూస్ ఇప్పుడు. ఇప్పుడు నడుస్తున్నదంతా డిజిటల్ యుగమే.. అన్నింటికీ హార్డ్ డిస్కులే. అందుకే RC16 కోసం సినిమాటోగ్రఫర్ రత్నవేలు సినిమాలో కొంత భాగానికి నెగటివ్ రీల్ వాడనున్నట్లు తెలుస్తుంది. RC16 పీరియడ్ సినిమా కాబట్టి.. రీల్‌తో షూట్ చేస్తే బాగుంటుందనేది రత్నవేలు ఆలోచన. హాలీవుడ్‌లో క్రిస్టోఫర్ నోలెన్ ఓపెన్ హైమర్ సినిమాను ఇలాగే షూట్ చేసి రీల్స్ భద్రపరిచారు. హై బడ్జెట్ క్వాలిటీ కోసం కాంప్రమైజ్ కాలేదు. తాజాగా RC16లో కొంత భాగానికే ఇదే చేయాలని చూస్తున్నారు. ఇది వర్కవుట్ అయితే.. టాలీవుడ్‌లో మళ్లీ నెగిటివ్ రీల్ మేకింగ్‌కు ఊపొస్తుందేమో..?

క్రీడా వార్తలు | SPORTS NEWS



# రిటైర్మెంట్ ప్రకటించిన శ్రీలంక స్టార్ క్రికెటర్

శ్రీలంక మాజీ కెప్టెన్ దిముత్ కరుణరత్నే సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించాడు. స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగే రెండో టెస్ట్ తన కెరీర్‌లో చివరి మ్యాచ్ అని వెల్లడించాడు. 36 ఏళ్ల కరుణరత్నేకు టెస్ట్‌ల్లో ఇది 100వ మ్యాచ్ కావడం విశేషం. లెఫ్ట్ హ్యాండ్ ఓపెనింగ్ బ్యాటర్ అయిన కరుణరత్నే 2012లో తన టెస్ట్ కెరీర్ ప్రారంభించాడు. 13 ఏళ్ల జర్నీలో కరుణరత్నే ఎన్నో మైలురాళ్లను అధిగమించాడు. కెప్టెన్‌గా శ్రీలంకకు ఎన్నో అపురూప విజయాలు అందించాడు. 2019లో శ్రీలంక జట్టు కరుణరత్నే సారథ్యంలో సౌతాఫ్రికాను వారి సొంతగడ్డపై 20 తేడాతో (టెస్ట్‌ల్లో) ఓడించింది. సౌతాఫ్రికాను వారి స్వదేశంలో 20 తేడాతో ఓడించిన ఏకైక ఆసియా కెప్టెన్ కరుణరత్నేనే. టెస్ట్‌లకు ముందే (2011, జులైలో) వన్డే అరంగేట్రం చేసిన కరుణరత్నే ఈ ఫార్మాట్ లో అశించినంతగా రాణించలేకపోయాడు. 50 ఓవర్ల ఫార్మాట్ లో అతను 50 మ్యాచ్‌లు ఆడి 31.3 సగటున 1316 పరుగులు చేశాడు. ఇందులో 11 హాఫ్ సెంచరీలు, సెంచరీ ఉంది. కరుణరత్నే తన చివరి వన్డే మ్యాచ్‌ను భారత్‌లో జరిగిన 2023 ప్రపంచకప్‌లో ఆడాడు. వన్డేలతో పోలిస్తే కరుణరత్నే టెస్ట్ గణాంకాలు చాలా బాగున్నాయి. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతను 99 మ్యాచ్‌లు ఆడి 39.4 సగటున 7172 పరుగులు చేశాడు. ఇందులో 16 సెంచరీలు, 39 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. కరుణరత్నే శ్రీలంక తరఫున అత్యధిక టెస్ట్‌లు ఆడిన ఏడో ఆటగాడిగా నిలిచాడు. లంక తరఫున మహేళ జయవర్దనే అత్యధికంగా 149 టెస్ట్‌లు ఆడాడు. కాగా, ఆసీస్‌తో రెండో టెస్ట్ గాలే వేదికగా ఫిబ్రవరి 6న మొదలవుతుంది. ఈ మ్యాచ్‌తోనే కరుణరత్నే ఆటకు వీడ్కోలు పలుకనున్నాడు. ఆసీస్‌తో జరిగిన తొలి టెస్ట్‌లో శ్రీలంక ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ మ్యాచ్‌లో ఆసీస్ ఇన్నింగ్స్ 242 పరుగుల తేడాతో గెలుపొందింది. ఉస్మాన్ ఖ్వాజా డబుల్ సెంచరీ (232), స్టీవ్ స్మిత్ (141), జోష్ ఇంగ్లిస్ (102) సెంచరీలు చేసి ఆసీస్‌కు తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ (654/6) అందించారు. అనంతరం బరిలోకి దిగిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 165 పరుగులకే ఆలౌటై ఫాలో ఆన్ ఆడింది.

# మెస్సీ కాదు!..

## నేనే అత్యుత్తమ ఆటగాడిని: రొనాల్డో

**దాదాపు దశాబ్ద కాలానికి పైగా ఫుట్‌బాల్ ప్రపంచంలో మకుటం లేని మహారాజులుగా వెలుగొందుతున్నారు పోర్చుగల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో - అర్జెంటీనా లెజెండ్ లియోనల్ మెస్సీ. అద్భుతమైన ఆట తీరుతో ఆకట్టుకునే ఈ ఇద్దరికీ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఉన్నారు. అయితే, ఈ వీళ్లిద్దరిలో ఎవరు గొప్ప అన్న చర్చ ఎప్పుడూ ఆసక్తికరమే.**

ఈ విషయంపై రొనాల్డో స్వయంగా స్పందించాడు. చాలా మంది మెస్సీకే గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ బిరుదు ఇచ్చేందుకు మొగ్గుచూపవచ్చని అభిప్రాయపడ్డాడు. అయితే, తాను మాత్రం పరిపూర్ణ ఫుట్‌బాలర్‌ని అని పేర్కొన్న రొనాల్డో.. ఫుట్‌బాల్ చరిత్రలో తన కంటే గొప్ప ఆటగాడు లేదని అనడం విశేషం.

### నేనే కంప్లీట్ ప్లేయర్

స్పానిష్ మీడియా అవుట్‌లెట్ లాసెక్టా టీవీకి తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో క్రిస్టియానో రొనాల్డో మాట్లాడుతూ.. ''నాలాగా ప్రపంచంలో పరిపూర్ణమైన ఫుట్‌బాలర్ మరెవరూ లేరని అనుకుంటా. ఇప్పటి వరకు ఉన్న ఫుట్‌బాల్ ఆటగాళ్లందరిలో నేనే 'కంప్లీట్ ప్లేయర్'. నేను అన్ని రకాలుగా ఫుట్‌బాల్ ఆడగలను. చాలా మంది మెస్సీ, మారడోనా లేదంటే.. పీలే పేరు చెప్తారేమో!

### చరిత్రలోనే అత్యుత్తమ ఆటగాడిని

వాళ్ల అభిప్రాయాన్ని నేను గౌరవిస్తాను. ఏదేమైనా మోస్ట్ కంప్లీట్ ప్లేయర్ మాత్రం నేనే! ఫుట్‌బాల్ చరిత్రలోనే నేను అత్యుత్తమ ఆటగాడిని. నా కంటే మెరుగ్గా ఆడే ఫుట్‌బాలర్‌ను ఇంత వరకూ చూడలేదు. ఇవి నా మనస్ఫూర్తిగా చెబుతున్న మాటలు'' అని పేర్కొన్నాడు. అదే విధంగా మెస్సీతో తన అనుబంధం గురించి చెబుతూ.. ''మెస్సీతో నాకు ఎప్పుడూ ఎలాంటి సమస్యా లేదు. గత పదిహేనేళ్లుగా మేము అవార్డులు పంచుకుంటున్నాం. మా మాధ్య ఎలాంటి గొడవలు లేవు. అంతా సవ్యంగానే ఉంది. తనకోసం నేను ఆంగ్లాన్ని తర్జుమా చేసిన సందర్భాలు ఉన్నాయి. అప్పట్లో భలే సరదాగా ఉండేవాళ్లం. ఇక ఆటగాళ్లుగా మేము ప్రత్యర్థులమే కదా. తను తన క్లబ్‌కి, నేను నా క్లబ్‌కి మద్దతుగా ఉంటాం. జాతీయ జట్ల విషయంలోనూ అంతే. అయితే, ఆటతీరు ఎలా ఉందన్న అంశంపై పరస్పరం చర్చించుకుంటూ.. ఫీడ్‌బ్యాక్ తీసుకుంటాం. మా మధ్య ఎల్లప్పుడూ ఆరోగ్యకరమైన పోటీయే ఉంటుంది'' అని రొనాల్డో తెలిపాడు. కాగా 2002లో పోర్చుగీస్ క్లబ్ స్పోర్టింగ్ జీపీ తరఫున ప్రొఫెషనల్ ఫుట్‌బాలర్‌గా ఎంట్రీ ఇచ్చిన రొనాల్డో.. క్లబ్, అంతర్జాతీయ స్థాయిలో కలిపి ఓవరాల్‌గా 923 గోల్స్‌తో టాప్ గోల్‌స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. తన సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో రికార్డులు సాధించిన రొనాల్డోకు ఫిఫా వరల్డ్‌కప్ మాత్రం అందని ద్రాక్షగా మిగిలిపోయింది.





# ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్

## రోహిత్ శర్మను ఊరిస్తున్న భారీ రికార్డు

ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను ఓ భారీ రికార్డు ఊరిస్తుంది. ఈ సిరీస్‌లో హిట్‌మ్యాన్ మరో 134 పరుగులు చేస్తే, విరాట్ కోహ్లి తర్వాత వన్డేల్లో అత్యంత వేగంగా 11,000 పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా రికార్డుల్లోకెక్కుతాడు. ఈ రికార్డు సాధించేందుకు రోహిత్‌కు మరో 19 ఇన్నింగ్స్‌ల సమయం ఉంది. ప్రస్తుతం రోహిత్ 257 వన్డే ఇన్నింగ్స్‌ల్లో 31 సెంచరీలు, 57 అర్ధ సెంచరీల సాయంతో 10866 పరుగులు చేశాడు. విరాట్ వన్డేల్లో 11,000 పరుగులను 222 ఇన్నింగ్స్‌ల్లోనే పూర్తి చేశాడు. వన్డేల్లో వేగంగా 11,000 పరుగులు పూర్తి చేసిన ఆటగాళ్ల జాబితాలో విరాట్ తర్వాతి స్థానంలో సచిన్ టెండూల్కర్ ఉన్నాడు. సచిన్ 276 ఇన్నింగ్స్‌ల్లో ఈ మైలురాయిని అధిగమించాడు. రోహిత్ మరో 19 ఇన్నింగ్స్‌ల్లో 134 పరుగులు చేస్తే సచిన్‌ను వెనక్కు నెట్టి విరాట్ తర్వాతి స్థానాన్ని ఆక్రమిస్తాడు. కాగా, ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌తో రోహిత్ శర్మ ఈ ఏడాది తొలిసారి టీమిండియా తరఫున బరిలోకి దిగనున్నాడు. జనవరి ప్రారంభంలో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో రోహిత్ బరిలోకి దిగలేదు. ఫామ్‌లేమి కారణంగా రోహిత్ వాలంటీర్‌గా ఆ మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. అనంతరం ఈ ఏడాది భారత్ ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ ఆడింది. గతేడాది టీ20 వరల్డ్‌కప్ అనంతరం రోహిత్ పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంతో ఈ సిరీస్‌లో ఆడలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఇంగ్లండ్‌తో జరుగబోయే తొలి వన్డే రోహిత్‌కు ఈ ఏడాది భారత్ తరఫున తొలి మ్యాచ్ అవుతుంది.

### రంజీల్లోనూ నిరాశే

ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ జరిగే సమయంలో రోహిత్ రంజీ బరిలోకి దిగాడు. ఖాళీగా ఉన్న సమయంలో టీమిండియా క్రికెటర్లంతా రంజీల్లో ఆడాలని బీసీసీఐ అల్టిమేటం జారీ చేసిన విషయం తెలిసిందే. సుదీర్ఘ విరామం అనంతరం రంజీ మ్యాచ్ ఆడిన రోహిత్ ఘోరంగా విఫలమయ్యాడు. గతేడాది నుంచి పెద్దగా ఫామ్‌లో లేని రోహిత్ రంజీ మ్యాచ్‌తో అయినా తిరిగి టచ్‌లోకి రావాలని భావించాడు. కానీ రోహిత్‌కు అక్కడ కూడా నిరాశే ఎదురైంది.

### ఫిబ్రవరి 6 నుంచి మొదలు

ఇంగ్లండ్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఫిబ్రవరి 6 నుంచి మొదలవుతుంది. తొలి మ్యాచ్ నాగ్‌పూర్ వేదికగా జరుగనుంది. అనంతరం ఫిబ్రవరి 9, 12 తేదీల్లో రెండు, మూడు వన్డేలు జరుగనున్నాయి. ఈ మ్యాచ్‌లను కటక్, అహ్మదాబాద్ వేదిక కానుంది. ఈ మూడు మ్యాచ్‌లు మధ్యాహ్నం 1:30 గంటల నుంచి ప్రారంభమవుతాయి.

### చిత్తుగా ఓడిన ఇంగ్లండ్

వన్డే సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ భారత్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడింది. ఈ సిరీస్‌ను టీమిండియా 4-1 తేడాతో కైవసం చేసుకుంది. తాజాగా ముగిసిన చివరి టీ20లో భారత్ 150 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ విధ్వంసకర శతకంతో విరుచుకుపడ్డాడు. అనంతరం బౌలర్లు తలో చేయి వేసి భారత్‌కు ఘన విజయాన్ని అందించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com